ABINAND GRAND
HOTELS & RESORTS
Plot No.11, Shiva Ganga Colony,
Opp. Big Bazaar, L.B. Nagar,
Hyderabad - 500 068.
Ph:040-24039994, 24039995, 24039996
www.abinandgrand.com

నేటికేసరి
NETI KESARI TELUGU DAILY
తెలుగు దినపత్రిక

Click Here
E- Paper

శనివారం 31 - 05 - 2025 హైదరాబాద్ సంపుటి: 16 సంచిక: 121 పేజీలు : 12 వెల : 2/-


# కవిత ఎపిసోడ్
# టీ కప్పులో తుఫాన్



**హైదరాబాద్ - నేటి కేసరి ప్రతినిధి**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎపిసోడ్ ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వ్యవహారంపై తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. ఇవాళ(శుక్రవారం) గాంధీభవన్‌లో మీడియాతో మంత్రి పొంగులేటి చిట్‌చాట్ చేశారు. కవిత ఎపిసోడ్ టీ కప్పులో తుఫాన్ అని కొట్టిపారేశారు. ఒకరు ఆడమంటారు మరొకరు ఆడతారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్కటి కాదు చాలా తప్పులు చేశారని... అన్నిటికి శిక్ష తప్పదని వార్నింగ్ ఇచ్చారు. కేసీఆర్ దగ్గర దెయ్యాలు ఉన్నాయని కవిత అంటున్నారని.. ఆ దెయ్యాలు ఎవరో కవితనే చెప్పాలని అన్నారు. దేవుడు, దెయ్యాలు అంటున్న కవిత నోరు ఎందుకు విప్పడం లేదని ప్రశ్నించారు. కవిత నోరు విప్పాలని.. ఆమె ఏం చెబుతుందో వినాలని తాము కూడా చూస్తున్నామని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌కి బీజేపీతో బంధం ఉందని కవిత స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. బీజేపీ ఎమ్మెల్యే కూడా ఈ విషయాన్ని అంగీకరించారని చెప్పారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.మాజీమంత్రి కేటీఆర్‌కు ఈడీ అంటే ఉత్సాహం ఎక్కువగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈడీ అధికారులు తన ఇంటికి ఎప్పుడూ రాలేదని... వారు తన ఇంటికి ఎందుకు రావట్లేదో.. కేటీఆర్ అడిగితే బాగుంటుందని చెప్పారు. ఢిల్లీలో బీజేపీ, బీఆర్ఎస్‌కు దోస్తానా ఉందని ఆరోపించారు. కవితనే ఆ విషయం స్వయంగా చెబుతున్నారని అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం లేదని ప్రతిపక్షాలు చెబుతున్నాయి.. కానీ అర్ధరాత్రయినా రాహుల్‌గాంధీని కలిసే చనువు రేవంత్‌రెడ్డికి ఉందని స్పష్టం చేశారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.గత కేసీఆర్ ప్రభుత్వంలోని భూభకాసురుల సంగతి త్వరలో తెలుస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం.. జిల్లాల ప్రతినిధుల ఎంపిక!
# రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా ఏర్పాట్లు




**హైదరాబాద్ - నేటి కేసరి ప్రతినిధి**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రం నలుమూలలా ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో వివిధ వేడుకల్లో పాల్గొననున్నారు. అదేవిధంగా, జిల్లాల్లో జరిగే వేడుకల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మొత్తం 32 జిల్లాలకూ మంత్రులు, సలహాదారులు, వివిధ పదవుల్లో ఉన్న నాయకులను ప్రతినిధులుగా నియమించింది. వీరు ఆయా జిల్లాల్లో జరిగే అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. వేడుకల సందర్భంగా ప్రతి జిల్లాలో ముందుగా తెలంగాణ కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరులకు నివాళులు అర్పించనున్నారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించడం జరుగుతుంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసేలా ప్రభుత్వం సూచనలు జారీ చేసింది. ఇక జిల్లాల వారీగా ఎవరు ఏ ప్రాంతాల్లో ప్రతినిధులుగా హాజరవుతారన్న వివరాలను ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వుల రూపంలో విడుదల చేసింది.

2లో

# బీఆర్ఎస్ నిఘా నీడలో కవిత పర్యటన



**మంచిర్యాల - నేటి కేసరి ప్రతినిధి**

జిల్లాలో ఎమ్మెల్సీ కవిత పర్యటనపై బీఆర్ఎస్ అధిష్టానం పూర్తిస్థాయిలో నిఘా పెట్టింది. పార్టీకి సంబంధించి నేతలు ఎవరెవరు వెళ్తున్నారనే దానిపై ఆరా తీసింది. సొంత మీడియా

2లో

# ప్రధాని మోదీ..
## అందుకే పాకిస్థాన్‌తో యుద్ధం ఆపేశారు..

**న్యూఢిల్లీ - నేటి కేసరి ప్రతినిధి**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సరైన రీతిలో యుద్ధం చేయలేక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రలోభానికి గురై వెనకడుగు వేశారని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌పై భారతదేశం చేసిన యుద్ధం తీరు తెన్నుల గురించి తెలియాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ఇందిరా గాంధీ హయాంలో జరిగిన యుద్ధం..మోదీ హయాంలో జరిగిన యుద్ధాన్ని పోలుస్తూ ఇందిరాగాంధీ హయాంలోని 90 వేల మంది సైనికులు ముక్కుకు నెలకి రాశారని షాకింగ్ కామెంట్స్ చేశారు మహేష్ కుమార్ గౌడ్. బీజేపీ నేతలకు వార్నింగ్... ఇవాళ(శుక్రవారం) గాంధీభవన్‌లో

2లో



# రాహుల్ గాంధీని విమర్శిస్తే చూస్తూ ఊరుకోం..

**హైదరాబాద్ - నేటి కేసరి ప్రతినిధి**

బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావుపె టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై రఘునందన్ రావు పరిధి దాటి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఇవాళ(శుక్రవారం) గాంధీభవన్‌లో మీడియాతో జగ్గారెడ్డి మాట్లాడారు. ఏది పడితే అది మాట్లాడవద్దని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మొట్టికాయలు వేస్తే.. రాహుల్ గాంధీ గురించి మాట్లాడుతున్నారని చెప్పారు. రాహుల్ గాంధీని

2లో



# కేసీఆర్ ఆ ఆధారాలు బయటపెట్టు..

**న్యూఢిల్లీ - నేటి కేసరి ప్రతినిధి**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎపిసోడ్ ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై తాజాగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. ఇవాళ(శుక్రవా రం) ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. బీఆర్ఎస్ బీజేపీలో విలీనం చేసే కుట్ర జరుగుతుందంటూ కవిత చేసిన వ్యాఖ్యలపై

2లో



# వాస్తవాల ప్రాతిపదికన పథకాలు తీసుకొస్తాం: మంత్రి సీతక్క



**హైదరాబాద్ - నేటి కేసరి ప్రతినిధి**

తెలంగాణలో విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, నేర్చుకునే సామర్థ్యం, పని, కుటుంబ పరిస్థితులపై సెస్ సర్వే చేయడం అభినందనీయమని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈరోజు (శనివారం) బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ ప్రాంగణంలో యంగ్ లైవ్స్ రౌండ్ - 7 సర్వే నివేదికను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. సర్వే నివేదికలు విధాన రూపకల్పనలో ప్రభుత్వానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

క్షేత్రస్థాయి అధ్యయనాల వల్ల ప్రభుత్వ విధానాల్లో ఏవైనా లోటు పాట్లు ఉంటే సవరించుకోవచ్చని చెప్పారు. తెలంగాణలో విద్య, వైద్యం, పౌష్టికాహారం కోసం తెలంగాణ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పాఠశాలల్లో ప్రభుత్వ హాస్టల్లలో మెరుగైన విద్యతో పాటు, మెరుగైన భోజన సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. సరైన పౌష్టికాహారం లేకపోతే విద్యార్థులు విద్య మీద దృష్టి సారించలేకపోతున్నారని అన్నారు. ఒక ఆదివాసి బిడ్డగా తనకు ఆకలి బాధ తెలుసన్నారు. అందుకే ఎక్కడ ఫుడ్ గ్యాప్స్ లేకుండా అన్ని చర్యలు

నేటికేసరి



## ప్రధాని మోదీ.. అందుకే పాకిస్థాన్‌తో యుద్ధం ఆపేశారు..

మొదటిపేజి తరువాయి

మీడియాతో మహేష్ కుమార్ గౌడ్ చిట్‌చాట్ చేశారు. బీజేపీ నేతలు రాహుల్‌గాంధీపై అవాకులు చెవాకులు పెళుతున్నారు.. తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. సైనికులకు బాసటగా రాహుల్‌గాంధీ నిలిస్తే విమర్శలు చేయడం బీజేపీ నేతల దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. భారతదేశ ప్రజలు అడుగుతున్నారు.. పాకిస్థాన్‌పై యుద్ధంలో సాధించింది ఏమిటి.. కోల్పోయింది ఏమిటని ప్రశ్నల వర్షం కురిపించారు. అపర ఖాళీ మాత ఇందిరాగాంధీ అని వాజ్‌పాయ్ కొనియాడిన విషయం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తెలవకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఇందిరా గాంధీ హయాంలో వందల సర్జికల్ స్ట్రైక్స్ జరిగాయని గుర్తుచేశారు. సైనిక రహస్యాలను రాజకీయ స్వార్థం కోసం బీజేపీ వాడుకొని లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు మహేష్ కుమార్ గౌడ్.

బీఆర్ఎస్ మునిగిపోయిన నావ..బీఆర్ఎస్ మునిగిపోయిన నావ అని.. ఆ నావలో ఉన్న వస్తువులు(డబ్బుల) కోసం మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంలో కొట్లాట జరుగుతోందని మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు. తెలంగాణలో ఎనిమిది సీట్లు ఉన్న బీజేపీతో కలిస్తే బీఆర్ఎస్ ఎనిమిది స్థానాలకు పరిమితమవుతుందని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలపై సమాధానం చెప్పే దమ్ము కిషన్‌రెడ్డికి ఉందా అని సవాల్ విసిరారు. బీజేపీ నేతలు ముందుగా వారి ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలకి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు మహేష్ కుమార్ గౌడ్.

వాటాల కోసం పంచాయితీ...కవిత, రాజాసింగ్ వ్యాఖ్యలను పోల్చి చూస్తే బీజేపీలో బీఆర్ఎస్ విలీనం తథ్యమని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. కేసీఆర్ కుటుంబంలో వాటాల కోసం పంచాయితీ మొదలైందని అన్నారు. నోటీసులు రాగానే కేసీఆర్, ఈటల రాజేందర్‌కి పాత బంధం మళ్లీ చిగురుచ్చిందని ఎద్దేవా చేశారు. కులసర్వే బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తోందని ఉద్ఘాటించారు. కాళేశ్వరం విషయంలో నోటీసులు రాగానే ...శామీర్‌పేటలోని ఓ ఫాంహౌస్‌లో మాజీ మంత్రి హరీష్‌రావుతో ఈటల రాజేందర్ సమావేశం అయ్యారని ఆరోపించారు మహేష్ కుమార్ గౌడ్.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం.. హరీష్‌రావుతో కలిసి ఈటల కేసీఆర్‌తో ఫోన్‌లో సంభాషించారని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. కవిత లెటర్ లీక్ వెనక ఆమె ప్రమేయం లేదా కేసీఆర్ కుటుంబ సభ్యుల ప్రమేయం ఉండవచ్చని షాకింగ్ కామెంట్స్ చేశారు. రాజాసింగ్, కవిత వ్యాఖ్యలతో ముడుపులు, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం గుట్టు వీడిందని చెప్పుకొచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్ మైత్రి గురించి కవిత చెప్పకనే చెబుతున్నారని అన్నారు. కేసీఆర్, కిషన్‌రెడ్డి కలవడం వల్లే బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగించారని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పరోక్షంగా చెబుతున్నారని అన్నారు. రాజాసింగ్ లేవనెత్తిన అంశాలకు జవాబు చెప్పకుండా రాహుల్ గాంధీపై విమర్శలు చేయడం బీజేపీ నేతల చేతగానితనమని మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వాస్తవాల ప్రాతిపదికన పథకాలు తీసుకొస్తాం: మంత్రి సీతక్క

మొదటిపేజి తరువాయి

తీసుకుంటున్నామని చెప్పారు. అమ్మాయిల్లో రక్తహీనతను నివారించేందుకు పోషకాలతో కూడిన చిక్కిల పంపిణీ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. సెస్ నిర్వహిస్తున్న సర్వేలకు, అధ్యయనాలకు కాంగ్రెస్ ప్రభుత్వం సహకారం పూర్తిస్థాయిలో ఉంటుందన్నారు. సెస్ ఇచ్చే వాస్తవాల ప్రాతిపదికన ప్రజా సంక్షేమం కోసం మరిన్ని పథకాలు తీసుకొస్తామన్నారు. సర్వేలు కేవలం సర్వేల కోసమే జరగకూడదని.. ప్రజల సమస్యలు, అభివృద్ధి ఆకాంక్షలు, విధానపరమైన లోటు పాట్లు తెలిపేలా సర్వేలు జరగాలని అన్నారు. వాస్తవాల ప్రాతిపదికన రూపొందిన సర్వేలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి పథకాలను రూపొందిస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.మంత్రి ఔదార్యం.. ఫిట్స్‌తో బాధపడుతున్న వ్యక్త పట్ల మంత్రి సీతక్క మానవత్వాన్ని చూపారు. పంజాగుట్ట ఫ్లైఓవర్‌పై ఓ వాహనదారుడికి ఫిట్స్ వచ్చాయి. ఆ మార్గంలో వెళ్తున్న మంత్రి సీతక్క. తక్షణమే స్పందించారు. తన వాహనాన్ని ఆపి అతని చేతిలో తాళం చెవులు పెట్టారు. అతను కోలుకునేదాకా మంత్రి సహాయపడ్డారు. అతను కుదుటపడే వరకు అక్కడే ఉండి ధైర్యం చెప్పి ఆ తరువాత సదరు వ్యక్తిని ఆస్పత్రికి పంపించారు. మంత్రి సీతక్క ఔదార్యాన్ని చూసిన ప్రతి ఒక్కరూ హ్యాట్సాఫ్ చెబుతున్నారు.

## కవిత ఎపిసోడ్ టీ కప్పులో తుఫాన్

మొదటిపేజి తరువాయి

హెచ్చరించారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు ఎవరిని పిలవాలో తమ ప్రభుత్వం చెప్పదని తేల్చిచెప్పారు. ప్రభుత్వమే చెప్పేది ఉంటే కేసీఆర్‌నే ముందు పిలవాలని చెప్పేవాళ్లమని అన్నారు. కాళేశ్వరంలో ఎల్ అండ్ టీ కంపెనీ కూడా ముద్దాయిగా ఉందని చెప్పారు. తప్పు చేసి దొరికి కూడా తండ్రి, కొడుకులు(కేసీఆర్, కేటీఆర్) దబాయిస్తున్నారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ వచ్చిన తర్వాత తప్పుచేసిన వారిపై సీరియస్ యాక్షన్ ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు.

## బీఆర్ఎస్ నిఘా నీడలో కవిత పర్యటన

మొదటిపేజి తరువాయి

ప్రతినిధులతో పర్యటన మొత్తాన్ని చిత్రీకరించాలని ఆదేశించింది. న్యూస్ అవసరం లేదని.. కవిత వెంట ఎవరెవరు ఉన్నారో వివరాలు ఇవ్వాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. అయితే పార్టీకి సంబంధించి నాయకులు ఎవరూ కూడా కవిత పర్యటనకు హాజరుకాకుండా ఆమెకు పెద్ద షాకిచ్చారు. కవిత టీజీబీకే అధ్యక్ష హోదాలో ఉన్న సమయంలో ఆమె వెంట తిరిగిన వందలాది మంది కార్మిక నేతలు, బీఆర్ఎస్ నేతలు ఎవరూ కూడా కవిత పర్యటనవైపు కన్నెత్తి చూడని పరిస్థితి. మర్యాదపూర్వంగానూ నేతలు మొహం చూపలేదు. కేవలం దాసరి ఉష మాత్రమే కాసేపు వచ్చి వెళ్లినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు కవిత పర్యటనకు దూరంగా ఉన్నారు. కేవలం జాగృతి కార్యకర్తలతో కలిసి మాత్రమే జిల్లాలో ఎమ్మెల్సీ పర్యటించారు. దీన్ని బట్టి బీఆర్ఎస్ నుంచి కవిత బయటకు వెళితే ఆమె వెంట ఎవరూ వెళ్లరన్న సంకేతం వెలువడినట్లైంది.అంతేకాకుండా మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పార్టీలో పరిణామాలు, తనకు జరిగిన అవమానాల గురించి చెప్పుకొచ్చారు కవిత. గత పదేళ్లుగా క్షోభను అనుభవిస్తున్నానని తెలిపారు. ఆ తరువాత మీడియా ముందుకు వచ్చిన సమయంలో బీఆర్ఎస్ పార్టీ ప్రస్తావన లేకుండానే ముగించేశారు. మీడియాతో ఆచితూచీ మాట్లాడారు ఎమ్మెల్సీ. కేవలం ఆపరేషన్ కగార్ గురించి మీడియాతో మాట్లాడుతూ... ఈ ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను తప్పు బట్టడంతో పాటు నంబాల కేశవరావు వంటి మావోయిస్టు నేతల మృతదేహాలను ఇవ్వకుండా బీజేపీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అలాగే సరస్వతీ పుష్కరాల్లో స్థానిక ఎంపీ వంశీని అవమానించారని... దీంతో కాంగ్రెస్ పార్టీలో దళిత వ్యతిరేకత బయట పడిందన్నారు. తనను కూడా పుష్కరాలకు ఆహ్వానించలేదని.. అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నట్లు తెలిపారు. దళితుడు కాబట్టే డిప్యూటీ సీఎంను యాదాద్రిలో కింద కూర్చొబెట్టారని పేర్కొన్నారు. కేవలం రెండు నిమిషాల్లోనే ఎమ్మెల్సీ కవిత తన మీడియా సమావేశాన్ని ముగించేశారు.

## రాహుల్ గాంధీని విమర్శిస్తే చూస్తూ ఊరుకోం.. ఎంపీ రఘునందన్ రావుకి జగ్గారెడ్డి మాస్ వార్నింగ్

మొదటిపేజి తరువాయి

విమర్శిస్తే తాము చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు జగ్గారెడ్డి.

కాంగ్రెస్ చరిత్ర గురించి రఘునందన్‌కి ఏం తెలుసని జగ్గారెడ్డి ప్రశ్నించారు. 544 సంస్థానాలను దేశంలో విలీనం చేసిన చరిత్ర కాంగ్రెస్‌దని గుర్తుచేశారు. రఘునందన్ ఇంకోసారి రాహుల్ గాంధీ గురించి మాట్లాడితే తమ ప్రతాపం చూపిస్తామని హెచ్చరించారు. బీజేపీ నేతలు చిల్లరగా మాట్లాడితే తాను ఊరుకోనని వార్నింగ్ ఇచ్చారు.

# కేసీఆర్ పాలనే బెస్ట్..

## దశాబ్దంలో మారిన గ్రామాల రూపురేఖలు



**పదేండ్లపాటు పరుగులు పెట్టిన రాష్ట్ర ఆర్థిక రంగం**
**జీఎస్డీపీ, తలసరి, జీఎస్టీ వసూళ్లలో గణనీయ వృద్ధి**
**కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఆర్థికం ఆగమాగం**
**16 నెలల కాలంలో తగ్గిన ప్రజల కొనుగోలు శక్తి**
**రవాణా శాఖ ఆదాయం పడిపోవడమే నిదర్శనం**

ఉమ్మడి పాలనలో దగాపడిన తెలంగాణ.. పదేండ్ల కేసీఆర్ హయాంలో ధనిక రాష్ట్రంగా విరాజిల్లింది. ఆర్థిక, సామాజిక, సంక్షేమ రంగాల్లో కొత్త శిఖరాలను అధిరోహించింది. అయితే, ఏదో శాపం తగిలినట్టు కేవలం 16 నెలల్లోనే మారిన ప్రభుత్వ తీరుతో సంక్షేమంతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులూ తలకిందులయ్యాయి.

జీఎస్డీపీ, తలసరి ఆదాయంలో జీఎస్టీ వసూళ్లలో దేశానికే తలమానికంగా నిలిచిన ఒకప్పటి తెలంగాణ ఇప్పుడు వెలవెలబోతున్నది. చేతిలో పైసల్లేక ప్రజల కొనుగోలు శక్తి అధఃపాతాళానికి పడిపోయింది.మొత్తంగా రాష్ట్ర ఆర్థికరంగం అతలాకుతలమయ్యింది. అందుకే, తెలంగాణలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంతో పోల్చితే గత కేసీఆర్ పాలనే బాగున్నదని ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' గణాంకాలతో సహా తేల్చిచెప్పింది.హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో పోల్చితే గత కేసీఆర్ పాలనే బాగున్నదని ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' పేర్కొంది. కేసీఆర్ పాలనలో గ్రామాల రూపురేఖలే మారిపోయాయని తెలిపింది. బీఆర్ఎస్ హయాంలో పదేండ్లపాటు తెలంగాణ ఆర్థికరంగం పరుగులు పెట్టిందని గణాంకాలు సహా గ్రోక్ వివరించింది. కానీ, కాంగ్రెస్ 16 నెలల పాలనలోనే ఆదాయపరంగా రాష్ట్రం వెనుకబడిపోయిందని స్పష్టంచేసింది. ప్రభుత్వ విధానాల ఫలితంగా ప్రజల ఆదాయం తగ్గిందని.. దీంతో కొనుగోలు శక్తి క్షీణించిందని పేరొన్నది. ఇటీవల రవాణా శాఖ ఆదాయం తగ్గడాన్ని ఇందుకు ఒక ఉదాహరణగా పేరొన్నది. పదేండ్ల కేసీఆర్ పాలన, కాంగ్రెస్ 16 నెలల పాలనపై గ్రోక్ చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి.

గ్రామాల్లో సంపూర్ణ పరివర్తన..'తెలంగాణలో గత దశాబ్దంలో గ్రామీణాభివృద్ధి గణనీయమైన పురోగతి సాధించింది' అని గ్రోక్ తెలిపింది. కేసీఆర్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని ప్రాధాన్యంగా తీసుకున్నదని, బీఆర్ఎస్ పాలనలో పల్లెప్రగతి, గ్రామజ్యోతి వంటి కార్యక్రమాలు గ్రామాల్లో సంపూర్ణ పరివర్తనను తీసుకొచ్చాయని తెలిపింది. స్వపరిపాలన, ఆర్థిక సాధికారత వంటి అంశాల్లో గుణాత్మకమైన మార్పులు కనిపించాయని పేరొన్నది. ఈ పురోగతిలో కేసీఆర్ ప్రభుత్వం కీలకపాత్ర పోషించిందని తెలిపింది. 2014 నుంచి 2023 వరకు చేపట్టిన అనేక కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల స్థితిగతులను మెరుగుపరిచాయని వెల్లడించింది.

కాంగ్రెస్ పాలనలో 11వ స్థానానికి..కాంగ్రెస్ హయాంలో తలసరి ఆదాయ వృద్ధి సైతం పడిపోయిందని గ్రోక్ పేర్కొంది. బీఆర్ఎస్ పాలనలో తలసరి ఆదాయం వేగంగా, స్థిరంగా పెరిగిందని, తెలంగాణను దేశంలో అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రాల స్థాయికి కేసీఆర్ ప్రభుత్వం తీసుకెళ్లిందని గ్రోక్ వెల్లడించింది. 2014-15లో తలసరి ఆదాయం రూ.1,24,104గా ఉండగా, 2023-24 నాటికి రూ.3,47,229కు చేరిందని తెలిపింది. తొమ్మిదేండ్లలో దాదాపు 180% వృద్ధిని నమోదు చేసిందని, సంవత్సరానికి సగటున 12-15% వృద్ధిరేటు సాధించిందని అభినందించింది. కాంగ్రెస్ 16 నెలల పాలనలో తలసరి ఆదాయ వృద్ధిరేటు గణనీయంగా తగ్గిందని గ్రోక్ స్పష్టంచేసింది. ఆర్థిక స్తబ్ధత సూచనలు కనిపిస్తున్నాయని తెలిపింది. 2024-25లో తలసరి ఆదాయ వృద్ధిరేటు 9.61 శాతంగా నమోదైందని, ఇది 2023-24లో 14.1%, 2022-23లో 16.2 శాతంతో పోలిస్తే చాలా తకువని పేర్కొంది. 16 నెలల కాలంలో సగటు వృద్ధిరేటు 6-7% మాత్రమే ఉండవచ్చని అంచనా వేసింది. 2024-25లో జాతీయ తలసరి ఆదాయ వృద్ధి 8-9% ఉంటుందని, తెలంగాణ ఈ సగటును అందుకోలేకపోయిందని తెలిపింది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి 2023-24 వరకు రాష్ట్రాల తలసరి ఆదాయ వృద్ధిలో టాప్-5లో ఉన్న తెలంగాణ, 2024-25లో 11వ స్థానానికి పడిపోయిందని వెల్లడించిం ది. మూలధన వ్యయం తగ్గడం (రూ.44,252 కోట్ల నుంచి రూ.32,745 కోట్లకు), 16 నెలల్లో రూ.లక్షన్నర కోట్లు అప్పులు చేయడం, జీఎస్టీ వసూళ్లు తగ్గడం వంటివి ఇందుకు కారణాలుగా తెలిపింది.

జీఎస్టీ వసూళ్లు ఆందోళనకరం...కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో జీఎస్టీ వసూళ్లు భారీగా తగ్గాయని కూడా గ్రోక్ తెలిపింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో జీఎస్టీ వసూళ్ల వృద్ధిని పోల్చితే స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తుందని వివరించింది.కేసీఆర్ ప్రభుత్వంలో జీఎస్టీ వసూళ్లు స్థిరమైన వృద్ధిని సాధించాయని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంలో ఇది కీలకపాత్ర పోషించిందని గ్రోక్ పేరొన్నది. 2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి, తెలంగాణ జీఎస్టీ వసూళ్లు సంవత్సరానికి సగటున 15-20% వృద్ధిరేటు సాధించిందని తెలిపింది. జాతీయ సగటు వృద్ధిరేటు (10-12%) కంటే ఎకువ సాధించడం విశేషమని అభినందించింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో జీఎస్టీ వసూళ్ల వృది తగ్గిందని గ్రోక్ పేర్కొంది. 2024-25లో సగటున 5-6 శాతానికి పరిమితమైందని తెలిపింది. 2025 మార్చిలో రూ.5,401 కోట్లు వసూలు కాగా, 2024 మార్చితో పోలిస్తే (రూ.5,399 కోట్లు) వృద్ధిరేటు 0 శాతంగా నమోదైంది. కేసీఆర్ పాలనలో జీఎస్టీ వసూళ్ల వృద్ధిలో దేశంలో తెలంగాణ టాప్-5లో ఉండేదని, కాంగ్రెస్ హయాంలో 14వ స్థానానికి పడిపోయిందని తెలిపింది.తగ్గుతున్న ప్రజల కొనుగోలు శక్తి..కాంగ్రెస్ హయాంలో ఆర్థిక వృద్ధి మందగించడం ప్రజల కొనుగోలు శక్తి తగ్గడానికి ఒక సూచిక అని గ్రోక్ హెచ్చరించింది. ఇటీవల రవాణా శాఖ ఆదాయం తగ్గడంపై ఏఐ చాట్‌బాట్ స్పందించింది. రవాణా శాఖ ఆదాయం తగ్గడం ఒక ఆందోళనకర అంశంగా పేరొన్నది. 'ఎందుకంటే ఇది రాష్ట్ర ఆర్థిక ఆరోగ్యానికి ఒక ముఖ్యమైన సూచిక. రవాణా శాఖ ఆదాయం వాహన రిజిస్ట్రేషన్లు, పర్మిట్లు, పన్నులు, జరిమానాల ద్వారా సమకూరుతుంది. ఇవి ప్రజల ఆర్థిక సామర్థ్యం, వాణిజ్య కార్యకలాపాల స్థాయిని ప్రతిబింబిస్తాయి. రవాణా శాఖ ఆదాయం తగ్గడం కొనుగోలు శక్తి తగ్గడాన్ని సూచిస్తుంది. ఇది వ్యాపారాలు, రియల్ ఎస్టేట్, వ్యవసాయ రంగాల్లో క్షీణతతో ముడిపడి ఉండవచ్చు' అని గ్రోక్ అభిప్రాయపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన మహాలక్ష్మి వంటి ఉచిత రవాణా సేవలు ఆర్టీసీ ఆదాయాన్ని గణనీయంగా దెబ్బతీస్తున్నాయని, రోజుకు రూ.5 కోట్ల నష్టం వస్తుందన్న అంచనాలు ఉన్నాయని తెలిపింది. ఈ పథకం అమలుకు ఏడాదికి రూ.10,000 కోట్లు అవసరమని ఆర్టీసీ అంచనా వేయగా, బడ్జెట్‌లో రూ.4,305 కోట్లే ప్రతిపాదించిందని విమర్శించింది. రియల్ ఎస్టేట్, హోటల్ రంగాల్లో కుదేలవడంతో వాహన కొనుగోళ్లు తగ్గి, రవాణా శాఖ ఆదాయంపై ప్రతికూల ప్రభావం పడిందని అభిప్రాయపడింది.

16 నెలల్లో ఆర్థికం ఆగమాగం..కేసీఆర్ హయాంలో తెలంగాణలో జీఎస్డీపీ గణనీయంగా పెరిగిందని గ్రోక్ స్పష్టంచేసింది. రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామి ఆర్థిక శక్తిగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిలిపిందని వెల్లడించింది. ఇదే సమయంలో 16 నెలల కాంగ్రె పాలనలో ఆర్థిక సంక్షోభ సూచనలు కనిపిస్తున్నాయని గ్రోక్ హెచ్చరించింది. రెండు ప్రభుత్వాల పాలనలో తేడాను గణాంకాలతో సహా వెల్లడించింది.

బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ జీఎస్డీపీ 2014-15లో రూ.5.05 లక్షల కోట్ల నుంచి 2023-24 నాటికి రూ.15.01 లక్షల కోట్లకు చేరుకుందని గ్రోక్ తెలిపింది. దాదాపు 196.9% వృద్ధిని సాధించినట్టు చెప్పింది. తద్వారా దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా తెలంగాణ నిలిచినట్టు వెల్లడించింది. 2014-15 నుంచి 2022-23 వరకు సగటు వృద్ధి రేటు 12.7% ఉందని, ఇది జాతీయ సగటు 10.5% కంటే ఎకువని గ్రోక్ స్పష్టంచేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ వంటి సాగునీటి పథకాలు, 24 గంటల ఉచిత విద్యుత్తు, రైతుబంధు, రైతు బీమా వంటి వ్యవసాయ సంబంధిత సంసరణలు, సేవల రంగంపై (ముఖ్యంగా ఐటీ) దృష్టి పెట్టడం వంటివి ఈ వృద్ధికి దోహదపడ్డాయని తెలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత, దాదాపు 16 నెలల పాలనలో (ఏప్రిల్ 2025 వరకు) జీఎస్డీపీ వృద్ధిరేటు, ఆర్థిక పురోగతి మునుపటి కంటే తగ్గినట్టు కనిపిస్తున్నదని గ్రోక్ పేర్కొంది. 2024-25లో జీఎస్డీపీ 10.12%గా ఉందని తెలిపింది. ఇది 2023-24లో బీఆర్ఎస్ హయాంలో సాధించిన 11.9% కంటే తకువని పేర్కొంది. 2024-25లో 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణ జీఎస్డీపీ వృద్ధిలో 14వ స్థానంలో నిలిచినట్టు పేరొన్నది. గతంలో తెలంగాణ టాప్-3 రాష్ట్రాల్లో ఉండగా.. కాంగ్రెస్ పాలనలో గణనీయంగా పతనమైనట్టు తెలిపింది.

వ్యవసాయ సంబంధిత పథకాలు..కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ వంటి సాగునీటి పథకాలు గ్రామీణ రైతులకు సాగు సౌలభ్యం కల్పించాయని, 24 గంటల ఉచిత విద్యుత్తు, రైతుబంధు, రైతుబీమా వంటివి రైతుల జీవన ప్రమాణాలను పెంచాయని గ్రోక్ పేరొన్నది.

స్వపరిపాలనజి..పంచాయతీలకు నిధులు నేరుగా విడుదల చేయడం, ఈ-పంచాయతీ వంటి డిజిటల్ వ్యవస్థల ద్వారా పంచాయతీల్లో పారదర్శకత, వాటి సామర్థ్యం పెరిగాయని గ్రోక్ తెలిపింది. 2023లో తెలంగాణ గ్రామ పంచాయతీలు జాతీయ స్థాయిలో 13 అవార్డులు గెలుచుకోవడం దీనికి నిదర్శనమని స్పష్టం చేసింది.సామాజిక సంక్షేమం..దళితబంధు, ఆసరా పింఛన్లు వంటి పథకాలు గ్రామీణ పేదల ఆర్థికస్థితిని బలోపేతం చేశాయని గ్రోక్ తెలిపింది. వీటికి తోడు స్త్రీనిధి లాంటి స్వయం సహాయక బృందాల ద్వారా బీఆర్ఎస్ సర్కారు మహిళల సాధికారతకు దోహదపడిందని తెలిపింది.మౌలిక సదుపాయాలు..ల పల్లెప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు వంటి వసతులు అందుబాటులోకి వచ్చాయని గ్రోక్ తెలిపింది. పల్లెప్రగతి పథకం గ్రామాలను పరిశుభ్రంగా, పచ్చగా మార్చడంలో సహాయపడిందని పేర్కొంది.

## కేసీఆర్ ఆ ఆధారాలు బయటపెట్టు.. కిషన్‌రెడ్డి మాస్ సవాల్

మొదటిపేజి తరువాయి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. ఇది డాడీ, డాటర్ సమస్య.. సిస్టర్, బ్రదర్ సమస్య.. ఇది ఒక కుటుంబ సమస్య అని విమర్శించారు. ఆస్తులు, పదవుల పంచాయితీ ఇదని.. వాళ్ల డ్రామాలో తాము భాగస్వామ్యం కాబోమని స్పష్టం చేశారు. బీజేపీలో మెర్జ్ కోసం ఎవరితో చర్చలు జరిగాయో... మాజీ సీఎం కేసీఆర్ ఆ ఆధారాలను బయట పెట్టాలని సవాల్ చేశారు. ఇది తెలంగాణ ప్రజలకు సంబంధం లేని అంశమని అన్నారు. కవిత ఎపిసోడ్‌పై బీజేపీ నేతలు స్పందించవద్దని కిషన్‌రెడ్డి ఆదేశించారు. రాహుల్‌గాంధీకి మెచ్యూరిటీ లేదు... పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలను భారత ఆర్మీ నేలమట్టం చేసిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన 28 నిమిషాల్లోనే.. కీలక ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసిందని వివరించారు. ఎంతమంది ఉగ్రవాదులు చనిపోయారని.. రాహుల్‌గాంధీ అడిగి ఉంటే సంతోషపడేవాళ్లమని చెప్పారు. దేశ రక్షణకు సంబంధించిన సున్నిత అంశాలపై.. మాట్లాడే విషయంలో రాహుల్‌గాంధీకి మెచ్యూరిటీ లేదని మండిపడ్డారు. భారతసైన్యం ధైర్య, సాహసాలను అనుమానించేలా.. రాహుల్‌గాంధీతో సహా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. సైన్యం పరాక్రమాన్ని బూడిదలో పోసిన పన్నీరు మాదిరిగా.. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సైనికులను అవమానించేలా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ

# టీయూడబ్ల్యూజే హెచ్ 143 ఉపాధ్యక్షునికి ఘన సన్మానం



**నేటి కేసరి మెట్ పల్లి మే30:**
టియుడబ్ల్యూజే హెచ్ 143 ఉపాధ్యక్షుడిగా నూతనంగా నియమించిన బండారి శివ ని అతని మిత్ర బృందం శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రిక రంగంలో అంచలంచలుగా ఎదుగుతూ అందరి ప్రేమాభిమానాలు పొందుతూ పత్రిక రంగంలో మంచి పేరు తెచ్చుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో చిలమంతుల శివకుమార్ పాంపట్టి అరుణ్, పడిగేల శ్రీను, అనంతుల రాకేష్ తదితరులు పాల్గొన్నారు

# అర్హులైన ప్రతి ఓక్కరికి సంక్షేమ పధకాలు అందించడం కాంగ్రెస్ లక్ష్యం



**కొడిమ్యాల ., మే 30నేటి కేసరి.**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాల మేరకు ఇండ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇయ్యాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు పోతుంది అందులో భాగంగా కొడిమ్యాల మండలానికి 444 ఇండ్లను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంజూరు చేసినందుకు కృత్ఞతగా మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో ఎమ్మెల్యే చిత్రపటానికి స్థానిక అంగడి చౌరస్తా లో పాలాభిషేకం చెయ్యడం జరిగింది .ఈ కార్యక్రమంలో మల్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం జీవన్ రెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిలువేరీ నారాయణ గౌడ్, నాయకులు గుడి మల్లిఖార్జున్ రెడ్డి,పిడుగు ప్రభాకర్ రెడ్డి,కొండూరి రాజేష్, చంద్రమోహన్ రెడ్డి, ముమ్మడి స్వామీ,మ్యాకల మల్లేశం, కంచర్ల రవి,బండి లక్ష్మి రాజం, జితేందర్ రెడ్డి,గంగయ్య,హుస్సేన్, ప్రశాంత్, రాజమల్లు, చొక్కాల నాగార్జున,లింగాల అజయ్, కోలాపురం రమేష్,రాఘవ రెడ్డి, సాయి, మంద శ్రీను, రంజిత్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి స్థలాల్లో నివాసం ఉండే వారికి శాశ్వత పట్టాలు ఇవ్వాలి

**– బిజెపి ఆధ్వర్యంలో బాధితులతో కలిసి ధర్నా**
**– జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట**



**మంచిర్యాల, నేటి కేసరి మే 30:**
నస్పూర్ పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా సింగరేణి కార్మికులు సింగరేణి కార్మికేతరలు సింగరేణి స్థలాలలో నివాసం ఉంటున్నారు. సింగరేణి స్థలాలలో నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరికి శాశ్వత ఇండ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రోజున మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బిజెపి ఆధ్వర్యంలో బాధిత ప్రజలతో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా మంచిర్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్, రఘునాథ్ వేరబెల్లి బిజెపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా నివాసం ఉంటూ ఇంటి పనులు కడుతూ పేదరికంలో ఉంటున్న ప్రజలకు శాశ్వత పట్టాలు ఇవ్వాలని, గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇళ్లపట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి పట్టాలు ఇవ్వకుండా పేద ప్రజలను మోసం చేస్తున్నారు అని వారు అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి వెంటనే ఇండ్ల పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

# వచ్చే నెల 3 నుండి 26వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు

**చిన్నశంకరంపేట, మే, నెటికేసరి**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చిన్న శంకరంపేట మండలంలోని వచ్చే నెల 3 నుంచి 20వ తేదీ వరకు ఆయా గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించ నిర్వహిస్తున్నట్లు స్థానిక తహసిల్దార్ అబ్దుల్ మన్నన్ తెలిపారు. భూ సంబంధిత సమస్యల దరఖాస్తులను స్వీకరించబడుతుందని అట్టి దరఖాస్తు పారాలు రెవిన్యూ సదస్సు నందు ఇవ్వడం జరుగుతుందని మండలంలోని రైతులు ఇచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ అబ్దుల్ మన్నన్ సూచించారు.

# జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డు ప్రామాణికం కాదు

**–టీడబ్ల్యూజేఎఫ్ సభ్యులందరికీ గుర్తింపు కార్డుల పంపిణీ**
**–జర్నలిస్టుల పట్ల ప్రభుత్వ వివక్ష సరికాదు**
**–రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**





**నేటి కేసరి జగిత్యాల( వీర్ల కిషన్ రావు ) మే 30 :**
మీడియా రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టులను జర్నలిస్టు అనడానికి ప్రభుత్వం జారీ చేసే అక్రెడిటేషన్ కార్డు ప్రామాణికం కాదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. ప్రభుత్వం గుర్తించిన మీడియా సంస్థలు, జర్నలిస్టు యూనియన్లు ఇచ్చే గుర్తింపు కార్డుతో జర్నలిస్టుగా పరిగణించాలని ఆయన సూచించారు. శుక్రవారం రోజున జగిత్యాలలో టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఫెడరేషన్ జిల్లా సభ్యులకు యూనియన్ గుర్తింపు కార్డుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య సంఘం సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులందరు ఐక్యతతో ఉండాలని, కొంతమంది అక్రిడిటేషన్ కార్డు లేదనే పేరుతో వివక్ష చూపడం సరైంది కాదని, ఇది చట్ట వ్యతిరేకమైన చర్య అని తెలిపారు . జర్నలిస్టును గుర్తించడం అంటే భారత ప్రభుత్వం ఆమోదించిన పత్రిక గుర్తింపు కార్డు మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని అన్నారు. అక్రెడిటేషన్ అనేది కేవలం ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకంలో భాగంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలా కాకుండా అక్రిడిటేషన్ లేదనే పేరుతో జర్నలిస్టుల పట్ల ప్రభుత్వ అధికారులు, తోటి జర్నలిస్టులు వివక్ష చూపించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. జర్నలిస్టులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ది కోసం అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాపితంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సభ్యులందరికి గుర్తింపు కార్డులిస్తామని,ప్రతి జర్నలిస్టుకు సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లాల జగన్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ కుడుతాడి బాపురావు,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ద్యావర సంజీవ రాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఏ.కిషన్ రెడ్డి, అధ్యక్షుడు ఎన్. జైపాల్, వేములవాడ అధ్యక్షుడు కరుణాకర్,జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు రాగం రమేష్, ఆముద లింగారెడ్డి, ఆర్.శ్రీనివాస్, నాయకులు వీర్ల కిషన్ రావు, కృష్ణ కుమార్, శ్రీనివాస రావు, చింత గంగాధర్, మహేష్, రోజా, జీవన్, , రాజలింగం, మహేంద్ర నాథ్, కాంతారావు, మాణిక్యం, గంగాధర్, మోహన్ రావు, సత్యనారాయణ, రామకృష్ణ, రమేష్, వేణు, నరేందర్ రావు, రవి, శ్రీనివాస్, అజయ్, రమేష్, రాజేందర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# రెండు నెలలు శ్రమించి వెంటలేటర్ పై ఉన్న గిరిజన యువతి కి ప్రాణదానం చేసిన భద్రాచలం ఏరియా ఆసుపత్రి సిబ్బంది

**–భద్రాచలం,చర్ల ఆసుపత్రుల వైద్య సిబ్బందిని అభినందించిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ , ఐటీడీఏ పీ ఓ రాహుల్ మరియు డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు.**

**నేటి కేసరి భద్రాద్రి కొత్తగూడెం మే 30**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెండు నెలల పాటు భద్రాచలం ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో చికిత్స అందించి పురుగుల మందును సేవించిన ఒక మహిళకు భద్రాచలం ఆసుపత్రి సిబ్బంది ప్రాణం పోశారు. వివరాల్లోకెళ్తే, చర్ల మండలం లక్ష్మీ కాలనీకి చెందిన 22 ఏళ్ల మడకం శిరీష అనే మహిళ మోనోక్రోటోఫోస్ అనే పురుగుల మందును రెండు నెలల క్రితం ఏప్రిల్ ఒకటవ తేదీన త్రాగి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ చర్లకు వెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి, కడుపులో ఉన్న పురుగుల మందును కొంత బయటకు తీశారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. విషపూరితమైన మోనోక్రోటోఫోస్ పురుగుల మందు అప్పటికే ఊపిరితిత్తులపై కొంత ప్రభావం చూపించగా కోన ఊపిరి తో ఉన్న ఆమెను ఊపిరి తిత్తుల వైద్యులు డాక్టర్ జగదీష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రెండు నెలల పాటు వెంటలేటర్ పై చికిత్స అందించి ఆ మహిళ ప్రాణాన్ని నిలబెట్టారు. ఆమెను డిస్చార్జ్ చేసే క్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు ఆసుపత్రిని శుక్రవారం సందర్శించి ఆమెకు చికిత్స చేసిన డాక్టర్ జగదీష్ మరియు ఇతర వైద్య సిబ్బందిని అభినందించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ భద్రాచలం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ ను అభినందించారు. రెండు నెలలు కష్టపడి వెంటిలేటర్ పై ఉన్న మహిళకు ఊపిరి పోసినందుకు భద్రాచలం వైద్య సిబ్బందిని మరియు వెంటనే స్పందించి ప్రాథమిక చికిత్స చేసినందుకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ చర్ల వైద్య సిబ్బందిని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్,ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ మరియు జిల్లా ఆసుపత్రుల ప్రధాన పర్యవేక్షణ అధికారి డాక్టర్ రవిబాబు అభినందించారు. ఇదే స్ఫూర్తితో రోగుల పట్ల అంకిత భావంతో సేవలందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

**ఆనందభాష్పాలతో కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు**

రెండు నెలలు రేయింబవళ్లు ఎంతో ఓపికతో చికిత్స చేసి తన బిడ్డను కంటికి రెప్పలా కాపాడిన భద్రాచలం వైద్య సిబ్బందికి శిరీష తండ్రి రమేష్ ధన్యవాదాలు తెలియజేశారు. " నా కూతురికి పునర్జన్మ ప్రసాదించిన భద్రాచలం , చర్ల వైద్యులకు, వైద్య సిబ్బందికి ఏమిచ్చిన రుణం తీర్చుకోలేనూ " అని ఆనందభాష్పాలతో తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

# బస్తీ దవాఖాన ను ప్రారంభించిన ఎమ్మెల్యే వివేక్

**–చెన్నూరు ప్రజలకు మెరుగైన వైద్యం, –13 లక్షల వ్యయంతో నిర్మాణం**

**నేటి కేసరి మంచిర్యాల మే 30**



చెన్నూర్ పట్టణంలో నూతనంగా నిర్మించిన బస్తీ దవాఖానా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ను చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రారంభించినారు. చెన్నూర్ పట్టణ మున్సిపాలిటీ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, 13 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన బస్తీ ద వాఖానను శుక్రవారం రోజున రిబ్బన్ కట్ చేసి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రారంభించినారు

**ఎమ్మెల్యే కృషి వల్లనే బస్తీ దవాఖానా**

చెన్నూరు పట్టణంలో దవాఖానా ఏర్పాటుకు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చాలా కృషి ఉందని దవాఖానా సిబ్బంది పేర్కొన్నారు. బస్తీ దవాఖానాను ప్రారంభించుకోవడం చాలా ఆనందంగా ఉందనీ తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ చెన్నూరు మున్సిపాలిటీ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని బస్తీ దవాఖానాను ప్రారంభించుకోవడం జరిగిందనీ తెలిపారు. న ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి నియోజకవర్గంలో వైద్యం, అభివృద్ధి పైన దృష్టి సారించాననీ పేర్కొన్నారు. దవాఖానాకు వచ్చే రోగుల పట్ల వైద్య సిబ్బంది మర్యాదగా ఉండాలని సూచించిన ఎమ్మెల్యే సూచించారు. రాబోయే ఎండా కాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

# మృతి చెందిన బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**చిన్నశంకరంపేట, మే ,29, నేటికేసరి**



మండల పరిధిలోని గవ్వలపల్లి గిరిజన తండాలో గురువారం రాత్రి మృతి చెందగా, ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ మెదక్ నియోజకవర్గ ఇన్చార్జి కాంటారెడ్డి తిరుపతిరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి? 5 వేల రూపాయలు నగదు ఆర్థిక సాయం బాధ్యత కుటుంబానికి అందించారు. కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్, సుధాకర్, కాట్రోత్ శీను నాయక్, బాబు, విట్టల్, దీప్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన వారికి పట్టాలు

**–ప్రతి నియోజకవర్గానికి 3 వేల500 ఇండ్లు మంజూరు**
**–షెట్పల్లి గ్రామంలో లబ్ధిదారులకు పట్టాలు**
**–అర్హత గల ప్రతి ఒక్కరికి పథకం ఫలాలు**



**నేటి కేసరి మంచిర్యాల మే 30**
నిరుపేదలకు గూడు కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు అందించడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని జైపూర్ మండలంషెట్పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని శివ్వారం, కిష్టాపూర్, వేలాల, పౌనూర్, కుందారం,నర్సింగాపూర్, షెట్పల్లి, బెజ్జాల గ్రామాల ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులకు చెన్నూర్ నియోజకవర్గ శాసనసభ్యులుగడ్డం వివేకానంద, గృహ నిర్మాణశాఖ పి.డి. బన్సీలాల్, తహశిల్దార్ వనజారెడ్డి లతో కలిసి పట్టాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఇందులోభాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.
జైపూర్ మండంలో588 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా మండలంలోని బెజ్జాలలో 16 మంది, కిష్టాపూర్లో 21 మంది, కుందారంలో 41మంది, నర్సింగాపూర్లో 15 మంది, పౌనూర్లో 24 మంది, షెట్పల్లిలో 34 మంది, శివ్వారంలో 25 మంది, వేలాలలో22 మంది మొత్తం 198 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 3 వేల500 ఇండ్లు మంజూరు కావడం జరిగిందని, పైలెట్ ప్రాజెక్టు చేపట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం విడతల వారిగా కొనసాగుతుందని, అర్హత గల ప్రతి ఒక్కరికి పథకం ఫలాలు అందుతాయనితెలిపారు. 2వ విడతలో సొంత ఇంటి స్థలం కలిగి ఉండి పథకం కొరకు అందిన దరఖాస్తులను కమిటీ ద్వారా పరిశీలించిఅర్హులైన నిరుపేదలను ఎంపిక చేసి ఆర్థిక చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. పథకం మంజూరైన లబ్ధిదారులువెంటనే నిర్మాణం చేపట్టాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుకను అవసరం మేరకు ఉచితంగా అందించడం జరుగుతుందనితెలిపారు. అర్హత కలిగి ఉండి పథకానికి ఎంపిక కాని అభ్యర్థులు పూర్తి వివరాలతో తమ దృష్టికి తీసుకువస్తే నిబంధనలప్రకారం చర్యలు తీసుకొని ఇందిరమ్మ ఇండ్ల పథకం ఫలాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# మహిళా చట్టాలపై ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించిన షీ టీం



**నేటి కేసరి జగిత్యాల ప్రతినిధి మే 30:**
మహిళల రక్షణ,వారి చట్టాలపై అవగాహన లక్ష్యంగా జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మహిళల పై జరిగే నేరాలపై పోలీసులకు సంప్రదించవలసిన తీరుపై, షీ టీం, భరోసా సెంటర్ యొక్క పనితీరు గురించి జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలోబరోసా కేంద్రం, షీ టీం వారు పిల్లలు, మహిళలు అనుభవించే వేధింపులు, హింసకు చట్ట పరంగా ఉన్న పరిష్కారాలను వివరించారు. అవసరమైనప్పుడు పోలీసుల సహాయాన్ని తీసుకోవాలంటూ సూచించారు. నేరుగా సంప్రదించలేను వారు షీ టీం నెంబర్ కి 8712670783 సంప్రదించాలని అన్నారు. ఉపాధ్యాయులు సమాజాన్ని మొల్డ్ చేసే ముఖ్యమైన స్థంభాలని అభివర్ణించారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మహిళా చట్టాలు, లైంగిక వేధింపుల నివారణ చట్టం (పోకసో యాక్ట్), వంటి చట్టాలపై అవగాహన కల్పించారు .ఉపాధ్యాయులు విద్యార్థుల నైతిక అభివృద్ధికి మద్దతుగా ఉండాలని వారు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని చట్టబద్ధంగా పరిష్కరించే దిశగా ముందడుగు వేయాలన్నారు.ఈ కార్యక్రమంలో భరోసా సెంటర్ కోఆర్డినేటర్ అనూష , సపోర్ట్ పర్సన్స్ సుజాత ,సౌజన్య మహిళా కానిస్టేబుల్ లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బలూచీ నుంచీ పాఠం నేర్చుకోవాలా

రాజకీయాలను రెండు రకాలుగా చూడొచ్చు. స్థూలదృష్టితో చూసి రేఖామాత్రంగా ఒక అవగాహన ఏర్పరచుకోవటాన్ని మొదటిదిగా చెప్పుకోవచ్చు. సాధారణ పౌరులు చాలావరకూ ఈ దృష్టితో సరిపెట్టుకుంటారు. దీనికి భిన్నంగా సూక్ష్మదృష్టితో రాజకీయాలను చూసి అందులోని మంచిచెడులను లోతుగా అవగాహన చేసుకుని వ్యూహాత్మక ప్రయోజనాల కోసం వాడుకోవటం రెండోదిగా భావించొచ్చు. ముఖ్యంగా విదేశీ వ్యవహారాల విషయంలో రెండోదానికి చాలా ప్రాధాన్యం ఉంటుంది. దీన్ని ప్రస్తుత పరిస్థితుల్లో అర్థంచేసుకోటానికి బలూచీస్థాన్ వ్యవహారాలను నిదర్శనంగా తీసుకోవచ్చు. కశ్మీరు సమస్యను పాకిస్థాన్ అంతర్జాతీయ వేదికల మీద లేవనెత్తినప్పుడల్లా బలూచీస్థాన్‌లో మీరేం చేస్తున్నారంటూ భారత్ తరపు నుంచి ప్రశ్నించటం ఇటీవల ఎక్కువైంది. సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీ కొన్నాళ్ల క్రితం పాకిస్థాన్‌ను ఇలాగే హెచ్చరించారు. పహల్గాం దారుణం అనంతరం బలూచీస్థాన్ వేర్పాటువాదులు పాక్ భద్రతాదళాలపై దాడులను ముమ్మరం చేశారు. కొంత ప్రాంతం పాక్ నుంచి విముక్తం అయినట్లు ప్రకటించారు. అంతకుముందు జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును నిర్బంధించి పాక్ సైన్యంతో ముఖాముఖీ తలపడ్డారు. అటూఇటూ చాలా ప్రాణనష్టం అనంతరం మాత్రమే పాక్ భద్రతాదళాలు పరిస్థితిపై పట్టుసాధించినట్లు ప్రకటించుకున్నాయి. ఈ తరహా హింసాత్మక చర్యలు బలూచీ చరిత్రలో కొత్తవి కావు. 1948 నుంచి ఇప్పటివరకూ ఏదోరూపంలో కొనసాగుతూనే ఉన్నాయి. బలూచీస్థాన్ సమస్యను వ్యూహాత్మక దౌత్య ప్రేమతో కాకుండా అక్కడి ప్రజల దృష్టి నుంచి చూస్తే... దారుణ అణచివేతలు, చిందిన రక్తపాతాలు, విచ్చలవిడి వనరుల దోపిడీలు, స్థానికులను అధమస్థానంలోకి నెట్టటం, రాజకీయ అధికారంలో భాగస్వామ్యాన్ని నిరాకరించటం, స్వపరిపాలనా కాంక్షను జాతి విద్రోహంగా పరిగణించటం, సైనిక బలంతో పెత్తనం సాగించటం, స్థానిక తెగలను అభివృద్ధి నిరోధకులుగా ముద్రవేయటం, రాజకీయ ప్రత్యర్థులను మాయం చేయటం, బూటకపు ఎన్‌కౌంటర్లతో ప్రజలను మట్టుబెట్టటం, స్థానిక భాషను తృణీకరించటం.. లాంటి ఎన్నో దురాగతాలతో ఆ నేలకు నిలువెల్లా గాయాలయినట్లు స్పష్టంగా కనపడుతుంది. పాక్‌కు బలూచీస్థాన్ పక్కలో బల్లెంలా మారటం మనలో కొందరికి సంతోషం వేయవచ్చు. అక్కడి ప్రభుత్వ వ్యతిరేక ప్రతిఘటనా రాజకీయాలకు వివిధ రూపాల్లో సహాయాన్ని అందించటం మన దౌత్యవ్యూహ చాతుర్యంగా భావించొచ్చు.

కానీ దానికి మించి అక్కడి పరిస్థితిని సమగ్ర దృష్టితో, మానవతాకోణం నుంచి చూస్తే ఎన్నో గుణపాఠాలనూ నేర్చుకోవచ్చు. స్వపాలనా ఆకాంక్షలను, జాతి గుర్తింపు కోసం చేసే ప్రయత్నాలను బలప్రయోగంతో అణచివేస్తే తీవ్రవాదాలు పుట్టుకొచ్చి పరిస్థితిని ఎంత భయంకరంగా మార్చుతాయో తెలుసుకోవచ్చు. బ్రిటిషు పాలకులు, ఆ తర్వాత అమెరికా, సోవియట్ రష్యా, చైనా సాగించిన నిర్వాకాలతో అక్కడి పరిస్థితి విషమంగా మారి జన జీవితాల్ని ఎంత ఛిద్రంచేసిందో అర్థం చేసుకోవచ్చు. బలూచీస్థాన్ చరిత్రే చాలా విచిత్రమైంది. అదెన్నో మలుపులు తిరిగింది.ఏ మలుపులోనూ స్థానికుల స్వరాన్ని లెక్కచేయకపోవటమే అక్కడ కనిపిస్తుంది. బ్రిటిషు వలసపాలకులు బలూచీస్థాన్‌లో అడుగుపెట్టేనాటికి అక్కడ బలమైన రాజ్యవ్యవస్థ లేదు. తెగల సమాహారంగా సమాజం ఉండేది. తెగల నాయకులు, పెద్దలు చెప్పేదే చెల్లుబాటు అయ్యేది. పన్నులను, శిస్తులను కూడా వాళ్లే నిర్ణయించేవాళ్లు. సున్నీ ముస్లిం మతం ప్రబలంగా ఉన్నా అది తెగల హద్దులను దాటి అందరినీ ఏకంచేసే స్థాయికి చేరలేదు. మతం జాతీయతా భావాన్ని కలగచేయలేదు. పర్షియన్, ఆఫ్గాన్, సింధీ, సిక్కు సైన్యాలు బలూచీస్థాన్‌పై దండెత్తినా తెగలను పూర్తిగా లొంగదీసుకోలేకపోయాయి. తెగల నుంచి కప్పం వసూలు చేసుకుని వాటి అంతర్గత విషయాల్లో పెద్దగా జోక్యం చేసుకోని పరిస్థితే ఉండేది. 18వ శతాబ్దంలో మాత్రమే తెగలను ఒక రాజ్యవ్యవస్థ కిందకు సమీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయి. కలాత్ ప్రాంతానికి చెందిన నజీర్‌ఖాన్ సారథ్యం కింద 25000 మందిని సైనికులుగా సమీకరించటంతో అక్కడ ప్రాథమిక రాజ్యవ్యవస్థ ఏర్పాటైంది. నజీర్‌ఖాన్ మరణం (1794) తర్వాత ఆ వ్యవస్థ కూడా బలహీనపడి పోయి, మళ్లీ విడివిడి తెగల ప్రాబల్యం పెరిగింది. కలాత్ ఖాన్‌ల కింద ఉన్న ప్రాంతంలోనే రాజ్యవ్యవస్థ కాస్త బలంగా ఉండేది. ఈ పరిస్థితి 1884 వరకూ కొనసాగింది. ఆ ఏడాది బ్రిటిషు వలసపాలకులు బలూచీస్థాన్‌ను మొత్తంగా స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. బ్రిటిషు సైన్యం రాకపోకలకూ రవాణా అవసరాలకూ వారికి బలూచీస్థాన్ కావాల్సి వచ్చింది. అందుకోసం కలాత్ పాలకుడితో ఒప్పందం కుదుర్చుకున్నారు. దాన్ని కొన్ని తెగలు గుర్తించకుండా బ్రిటిషు వారికి అడ్డంకులు సృష్టించాయి. దీన్ని సాకుగా తీసుకుని కలాత్ మీద దాడి చేసి అక్కడి ఖాన్‌ను చంపేశారు. బలూచీస్థాన్‌ను ఏడు ముక్కలు చేశారు. రెండు ముక్కలను ఇరాన్, ఆఫ్గానిస్థాన్‌ల్లో కలిపారు. మూడో భాగాన్ని బ్రిటిష్ బలూచీస్థాన్ పేరుతో తమ స్వాధీనంలో ఉంచుకున్నారు. మిగతా నాలుగు ముక్కల్లో కలాత్ కింద కొంత భాగాన్ని మిగిలిన మూడు ముక్కలను మూడు చిన్న సంస్థానాల కింద విభజించారు. దేశ విభజన నాటికి బలూచీస్థాన్‌ను ఏంచేయాలన్న ప్రశ్న వచ్చినప్పుడు బ్రిటిషు పాలకులు గతంలో ఇరాన్, ఆఫ్గానిస్థాన్‌ల్లో తాము కలిపేసిన ప్రాంతాల గురించి ఆలోచించలేదు. భారత్, పాక్‌ల్లో దేంట్లోనైనా చేరేందుకూ అందుకు ఇష్టం లేకపోతే స్వతంత్రంగా ఉండేందుకూ అప్పటి సంస్థానాలకు స్వేచ్ఛను ఇచ్చారు. మూడు చిన్న సంస్థానాలు పాకిస్థాన్‌లో చేరటానికి అంగీకరించినా కలాత్ పాలకుడు స్వతంత్రంగా ఉండటానికే నిర్ణయించుకున్నాడు. 1947 ఆగస్టు 15న స్వతంత్ర పాలకుడిగా తనను ప్రకటించుకున్నాడు. ఎంతో ఒత్తిడి వచ్చినా రక్షణ, విదేశీ వ్యవహారాలు మినహా మిగతా వ్యవహారాల్లో స్వయం నిర్ణయాధికారాన్నే కోరుకోవటంతో 1948 ఏప్రిల్‌లో పాక్ సైనిక చర్యను చేపట్టి విలీనం చేసుకుంది. 1947కు ముందు నుంచీ కూడా ప్రత్యేక దేశంగా ఉండటానికి బలూచీలు గట్టిగానే ప్రయత్నించారు. పాక్‌లో బలవంతంగా కలిపేసుకున్నా ఒక రాష్ట్రంగా సొంతంగా వ్యవహారాలు నడిపే హక్కుని కూడా ఇవ్వకపోవటంతో బలూచీల విషాదం మొదలైంది. బలూచీల హక్కులను నిరాకరించటం పాక్ వ్యవస్థాపకుడైన జిన్నాతోనే మొదలైంది. బలూచీస్థాన్‌ని నియంత్రించటానికి తన నేతృత్వంలో ఒక సలహామండలిని ఏర్పాటు చేసుకున్నారు. సర్వాధికారాలు కేంద్రం గుప్పిట్లో పెట్టుకునే వ్యవహారాలు అట్లా ఆనాడు మొదలయ్యాయి. అయూబ్ ఖాన్ సైనిక పాలనలో (1958) దేశం మొత్తాన్ని రెండు విభాగాలు చేశారు. దాన్నే 'వన్ యూనిట్ స్కీం'గా పిలిచేవారు. తూర్పు బెంగాల్‌ను ఒక యూనిట్‌గా, పశ్చిమ ప్రాంతాలను మరో యూనిట్‌గా పరిగణించటంతో రాష్ట్రాల హక్కులన్నీ హరించుకుపోయాయి. ఆ పరిస్థితిని వ్యతిరేకిస్తూ బలూచీస్థాన్‌లో మొదలైన ప్రతిఘటనను సైన్యంతో అణచివేశారు. 1962లో వామపక్ష అనుకూల జాతీయవాదులకూ ఆ పరిస్థితి తప్పలేదు. 1973 నుంచి 1977 వరకూ సాగిన అణచివేత బలూచీస్థాన్ చరిత్రలోనే అత్యంత ఘోరమైంది. 5300 మంది గెరిల్లాలూ, 3300 మంది సైనికులూ మరణించారు. పౌరుల మరణాలకు లెక్కేలేదు. 55000 బలూచీలు ఆయుధాలు పట్టారు. ఎన్నుకున్న ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయటంతో ఆనాటి ప్రతిఘటన రాజుకుంది. పాక్‌లో వయోజన ఓటుహక్కు కింద మొదటి ఎన్నికలు 1970లోనే జరిగాయి. ఇక ఆ ఏడాదే బలూచీస్థాన్‌కు రాష్ట్ర ప్రతిపత్తినీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన నేషనల్ అవామీ పార్టీ స్థానికులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వటం మొదలుపెట్టింది. బలూచీ ఆకాంక్షలను ఒక్కొక్కటిగా తీర్చటానికి అడుగులు వేయటం ప్రారంభించింది. పాక్ పాలకులకు అవి జాతి వ్యతిరేక చర్యలుగా కనపడ్డాయి. ప్రధానిగా జుల్ఫికర్ అలీ భుట్టోను పదవీచ్యుతుడ్ని చేసిన సైనిక పాలకులు కాల్పుల విరమణను ప్రకటించారు. ఆఫ్గనిస్థాన్‌లో రష్యా సేనల ప్రవేశంతో (1979) పరిస్థితి మారిపోయింది. బలూచీల పోరాటం వెనుకపట్టు పట్టింది. 1999లో ముషారఫ్ సైనిక పాలన రావటంతో మళ్లీ చిచ్చురగిలింది. చైనా%-%పాక్ ఎకనమిక్ కారిడార్‌లో భాగమైన గ్వాదర్ పోర్టు నిర్మాణంతో మొత్తం కారిడార్‌పైనే వ్యతిరేకత తలెత్తింది. స్వదేశీ%-%విదేశీ పెత్తనాలపై బలూచీల పోరాటం మళ్లీ ఉధృతమైంది. 2005 నుంచి పరిస్థితి రగులుతున్న రాక్షసిబొగ్గులాగానే తయారైంది. ఒకప్పుడు తెగల నాయకుల నుంచి నాయకులూ, గెరిల్లాలూ వస్తే రెండు దశాబ్దాల నుంచి మధ్యతరగతి, నగర జీవుల నుంచి ఆందోళనకారులు పుట్టుకొస్తున్నారు. రకరకాల పేర్లతో బలూచీ విముక్తి దళాలు రంగంలోకి వచ్చాయి. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, కిడ్నాపులు, ఆత్మాహుతి దాడులు, భద్రతా దళాలపై బాంబులు వేయటం నిత్యకృత్యంగా మారిపోయాయి. ఆఫ్గాన్ సరిహద్దులోని పష్టూన్ ప్రజల్లో ప్రాబల్యాన్ని పెంచుకున్న తాలిబాన్ తీవ్రవాదం, బలూచీల తిరుగుబాటు పాక్ పాలిట ప్రస్తుతం పెను సమస్యలుగా మారాయి. అధికారంలో ఏళ్లపాటు ప్రాతినిధ్యం లేకుండా చేసి, ఆర్థికంగా అట్టడుగుకు నెట్టేస్తే ఉత్పన్నమయ్యే పరిణామాలకు సూచికగా, బలూచీస్థాన్‌ను నిదర్శనంగా పేర్కొంటూ ఎన్నో విశ్లేషణలు వచ్చాయి. పాక్‌లో విస్తీర్ణం పరంగా బలూచీస్థానే పెద్ద రాష్ట్రం. కానీ జనాభాపరంగా దిగువున ఉంది. నిరుద్యోగం, నిరక్షరాస్యత ఎక్కువ. తలసరి ఆదాయం తక్కువ. నీటి సౌకర్యాలు అంతంత మాత్రమే. వ్యవసాయంపై ఆధారపడటం కష్టం. పశుపోషణే ఒకప్పుడు ప్రధానంగా ఉండేది. సహజవాయువు, ఖనిజ వనరులు, ముడిచమురు నిల్వలు మాత్రం పుష్కలంగా ఉన్నాయి. వీటిపై వచ్చే రాయల్టీల్లో సింహభాగం ఇప్పటికీ పంజాబీ, సింధీలే తన్నుకుపోతున్నారు. ఉన్నత, సాధారణ ఉద్యోగాల్లోనూ పంజాబీ, సింధీలదే ఆధిపత్యం. వ్యాపార, పరిశ్రమలూ వీరి చేతుల్లోనూ ఉన్నాయి. ఇక మిలటరీలో పంజాబీల గుత్తాధిపత్యానికి తిరుగులేదు. బలూచీ చరిత్ర చెప్పే సత్యం ఒక్కటే. రాజకీయ, ఆర్థిక అధికారాల్లో సముచిత ప్రాతినిధ్యం ఇవ్వకుండా, రాష్ట్రాల అధికారాలకు కత్తెరవేస్తూ, జాతీయ సమగ్రత పేరుతో ప్రాంతీయ ఆకాంక్షలను నేలరాస్తూ, వేర్పాటువాదులుగా ముద్రలువేస్తూ, సైనికబలంతో సమస్యలను పరిష్కరిద్దామనే వ్యూహం లెక్కలేనన్ని విపరిణామాలకు దారితీస్తుంది. హింసనే నమ్ముకునే విపరీత భావజాలాలను సృష్టిస్తుంది. బలూచీస్థాన్ అనుభవం నుంచి మనం నేర్చుకోవాల్సిన గుణపాఠం అదే!

-ఎడిటర్



తక్కువ ఖర్చుతోనే

# లక్షద్వీప్ టూర్ ప్యాకేజీలు..

**ప్రపంచంలోని అత్యంత అద్భుతమైన ఉష్ణమండల ద్వీప వ్యవస్థలలో లక్షద్వీప్ ఒకటి. కేరళ తీరానికి 220-440 కిలో మీటర్ల దూరంలో ఇది ఉంది. ఈ ద్వీపాలు విలువైన పర్యావరణ, సాంస్కృతిక వారసత్వాన్ని భావి తరాలకు అందిస్తున్నాయి. ఈ ద్వీపాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది పగడపు దిబ్బ. ఇది ఒక సహజమైన విశ్రాంతి ప్రదేశం. ఈ లక్షద్వీప్ 36 ద్వీపాల సమూహం. ఈ లక్షద్వీప్ నీటి అడుగున దృశ్యాలు రంగురంగులుగా ఊపిరిబిగపట్టి చూడాల్సినంత సుందరంగా ఉంటాయి. లక్షద్వీప్ సరస్సు ఈత కొట్టడానికి, విండ్-సర్ఫింగ్, డైవింగ్, స్నార్కెలింగ్, కయాకింగ్ లాంటి నీటి క్రీడలకు అనువుగా ఉంటుంది. ఇక్కడ ప్రతి ద్వీపంపైన మంచు తెల్లని పగడపు ఇసుకతో కప్పి ఉంటుంది. తేట తెల్లని నీరు, రకరకాల సముద్ర జీవులు ఈ ద్వీపాల అందాన్ని ఇనుమడింపజేస్తుంటాయి. ఈ ద్వీపాలు ప్రధాన భూభాగానికి అనుసంధానమై, పర్యాటకుల కోసం ఇక్కడ ఓడ, హెలికాప్టర్, ఎయిర్‌లైన్స్, మెకనైజ్డ్ సెయిలింగ్ లాంటి సదుపాయాలను కలిగి ఉన్నాయి. ఈ లక్షద్వీప్‌ను సందర్శించాలనుకునే వారికి రకరకాల ప్యాకేజీలు ఉన్నాయి. ఆ ప్యాకేజీల వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం..**

1. లక్షద్వీప్ సముద్రం..లక్షద్వీప్ సముద్రం అనేది ఐదు రోజుల సముద్ర యాత్ర. %వీ.ఎ% కవరత్తి ఓడలో కవరత్తి, కల్పేని, మినీకాయ్ దీవులను సందర్శించవచ్చు. ఈ ప్యాకేజీ కింద ఐదు రోజుల దీవుల పర్యటన పగటిపూట ఉంటుంది. మధ్యాహ్నం లంచ్ అందిస్తారు. రాత్రి వేళల్లో ఓడలోనే బస చేస్తారు. %వీ.ఎ% కవరత్తిలో 150 డైమండ్ క్లాస్ వసతి ఉంది. పగటిపూట యాత్ర సందర్భంగా ఈత, స్నార్కెలింగ్ ఇతర వాటర్ స్పోర్ట్స్‌ను సదుపాయాలు ఏర్పాటు చేస్తారు. ఏడాది నుంచి 10 ఏళ్ల వయసు వరకుగల పర్యాటకులను చిన్న పిల్లలుగా పరిగణిస్తారు.

చార్జీలు (డైమండ్ క్లాస్)..పెద్దలకు రూ.37500 ం 5 శాతం జీఎస్టీ

పిల్లలకు రూ.3000 ం 5 శాతం జీఎస్టీ

చార్జీలు (గోల్డ్ క్లాస్)

పెద్దలకు రూ.28500 ం 5 శాతం జీఎస్టీ

పిల్లలక రూ.22500 ం 5 శాతం జీఎస్టీ

నోట్: డిసెంబర్ నెలలో 10 శాతం పెంపు వర్తిస్తుంది.

2. స్వేయింగ్ పామ్ ప్యాకే..ఈ స్వేయింగ్ పామ్ ప్యాకేజీ అనేది మినికాయ్ దీవికి ఆరు నుంచి ఏడు రోజుల టూర్. పర్యాటకుల కోసం ప్రత్యేకమైన %ూ/ఎ% కాటేజీలతోపాటు బీచ్‌ల ముందు నిర్మించిన ఇతర వ్యక్తిగత కాటేజీలు కూడా అందుబాటులో ఉన్నాయి. %వీ.ఎ% అరేబియన్ సముద్రం, %వీ.ఎ% లక్షద్వీప్ సముద్రం, %వీ.ఎ%. మినికాయ్, %వీ.ఎ%. అమిందివి, కవరత్తి ఓడలలో ప్రయాణం సాగుతుంది.

3. మెరైన్ వెల్త్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్.. మెరైన్ వెల్త్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ 4 నుంచి 7 రోజుల ప్యాకేజీ. కద్మత్ వరకు ఈ టూర్ ఉంటుంది. సముద్ర జీవుల ఔన్నత్యాన్ని, అందాలను ఆస్వాదించడానికి ఈ ప్యాకేజీ బాగుంటుంది. ఈ ప్యాకేజీలో ప్రతి పర్యాటకుడు దీవిపై 2 నుంచి 5 రోజులు సరదాగా గడపవచ్చు. వాటర్ స్పోర్ట్స్‌లో భాగంగా స్విమ్మింగ్, స్నార్కెలింగ్, కయాకింగ్ లాంటి ఆటలను ఎంజాయ్ చేయవచ్చు. కద్మత్‌లో పూర్తిస్థాయి వాటర్ స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ ఉంది. సాహసం చేయగలిగిన వారు స్కూబా డైవింగ్, విండ్ సర్ఫింగ్, పారా సెయిలింగ్ లాంటి ఆటల్లో మునిగితేలవచ్చు.

చార్జీలు.సూపర్ డీలక్స్ ఏసీ రూమ్‌కు ఇద్దరికైతే రూ.11 వేలు, ఒక్కరికైతే రూ.8 వేలు. అదనంగా ప్రతి మనిషికి రూ.5 వేలు. డీలక్స్ ఏసీ రూమ్‌కు ఇద్దరికి రూ.9 వేలు, ఒక్కరికి రూ.6 వేలు, అదనంగా ప్రతి మనిషికి రూ.4 వేలు. ఎసీ స్టాండర్డ్ రూమ్‌కు ఇద్దరికి రూ.7 వేలు, ఒక్కరికి రూ.5 వేలు, అదనంగా ప్రతి మనిషికి రూ.3500. నాన్ ఏసీ రూమ్‌కు ఇద్దరికి రూ.5 వేలు, ఒక్కరికి రూ.3 వేలు, అదనంగా ప్రతి మనిషికి రూ.2500. డిసెంబర్‌లో 10 శాతం పెంపు వర్తిస్తుంది.

4. తారాతాషి ప్యాకే..తారాతాషి ప్యాకేజీ కవరత్తి దీవి సందర్శనకు సంబంధించినది. కవరత్తి లక్షద్వీప్ పరిపాలనా రాజధాని. ప్యాకేజీలో భాగంగా దీవిలో నాలుగు నుంచి ఐదు రోజుల బస ఉంటుంది. అద్దపు అడుగు కలిగిన బోటులో స్విమ్మింగ్, స్నార్కెలింగ్, స్కూబా డైవింగ్ చేయవచ్చు. ప్యాకేజీలో భాగంగా ఇతర వాటర్ స్పోర్ట్స్‌ను కూడా ఆఫర్ చేస్తున్నారు. ఈ టూర్‌తో మీ హాలీడేస్ ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఈ ద్వీపంలో బీచ్ ముందుగల పర్యాటకుల గుడిసెల్లో బస ఉంటుంది.

చార్జీలు..సూట్ రూమ్‌కు ఇద్దరైనా ఒక్కరైనా కనీసం రూ.11 వేలు, అదనంగా ప్రతి వ్యక్తికి రూ.4 వేలు.

5. తిన్నకరలో టెంట్‌లు

ఈ ప్యాకేజీ మీరు మీ సొంత దీవుల్లో ఉన్న అనుభూతిని కలిగిస్తుంది. తిన్నకర దీవి బంగారం దీవికి ఎదురుగా ఉంటుంది. విస్తారమైన సరస్సు తీరంతోపాటు పగడపు ఒడ్డును కలిగి ఉండటం ఈ దీవి ప్రత్యేకత. ఈ తిన్నకర అనేది అగట్టి నుంచి ఈశాన్యంగా 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక చిన్న కన్నీటి చుక్క ఆకారపు దీవి. ఈ దీవిలోని పనోరమా ఆవరణ, అద్భుతమైన సరస్సులు, సిల్వాన్ సముద్ర తీరాలు, ఎండలో తడిసిన ఇసుక, అద్భుతమైన సముద్ర వృక్షజాలం, జంతుజాలం మిమ్ములను మంత్రముగ్ధులను చేస్తుంది. కయాక్స్, గ్లాస్ బాటమ్డ్ బోట్స్ లాంటి వాటర్ స్పోర్ట్స్ క్రాఫ్టులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. మీరు బీచ్ వాలీబాల్ ఆడవచ్చు, సన్ బాత్ చేయవచ్చు.

చార్జీలు..గుడారాలకు అద్దె ఇద్దరికి రూ.10 వేలు, ఒక్కరికి రూ.8 వేలు, అదనంగా ప్రతి వ్యక్తికి రూ.4 వేలు.

6. బంగారం దీవిలో కాటేజీల.. బంగారం దీవి 120 ఎకరాలలో విస్తరించి ఉంది. ఈ దీవిలో జనావాసాలు లేవు. ఈ దీని పగడపు దిబ్బలచే ఆవరింపబడిన సరస్సుతో చుట్టుముట్టబడి ఉంటుంది. ఇది ప్రపంచంలోని ఉత్తమ విహార ప్రదేశంగా గుర్తింపు పొందింది. బంగారం దీవి నిండా ఉన్న కొబ్బరి తోటల్లో అందమైన చేపలు, పందికొక్కులు, చిలుకలు, పఫర్ ఫిష్‌లు, సన్యాసి పీతలు, సముద్ర పక్షులు కనువిందు చేస్తాయి. స్కూబా డైవింగ్, బీచ్ గేమ్స్, స్విమ్మింగ్, స్నార్కెలింగ్, డీప్ సీ ఫిషింగ్ వంటి అనేక సాహసాలు చేసే సౌకర్యం ఉంది. రిసార్ట్‌లో 60 పడకల బీచ్ కాటేజీలు (నాన్ ఏసీ), అనేక వంటకాలను అందించే బహుళ-వంటకాల రెస్టారెంట్ ఉన్నాయి. విమానాశ్రయం ఉన్న అగట్టి నుంచి బంగారం దీవికి చేరుకోవచ్చు.

చార్జీలు..కాటేజీల చార్జీ ఒక్కరైనా ఇద్దరైనా కనీసం రూ.18 వేలు, అదనంగా ప్రతి వ్యక్తికి రూ.8500.

7. స్కూబా డైవ్ ప్యాకే..ఈ ప్యాకేజీలో భాగంగా అన్ని డైవింగ్ పరికరాలను అందిస్తారు. స్విమ్మింగ్ స్కిల్స్, డైవింగ్‌కు అభ్యర్థి ఫిట్‌గా ఉన్నట్లు తెలిపే డాక్టర్ సర్టిఫికెట్ తప్పనిసరి. డైవింగ్ కోర్సులో పాల్గొనడానికి కనీస వయస్సు 14 సంవత్సరాలు ఉండాలి.

# అమృత ఫలం.. ఐస్ ఆపిల్!

తాటి ముంజలు.. ఎండకాలంలో మాత్రమే లభించే అమృత ఫలాలు. చూసేందుకు తెల్లని మంచు ముద్దలా నోట్లో వేసుకుంటే కరిగిపోయే వీటిని 'ఐస్ యాపిల్' అని పిలుస్తారు. ఎన్నో పోషకాలు, విటమిన్లతో నిండిన ఈ పండ్లు ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు అందిస్తాయి.

తాటి ముంజల్లో యాంటి ఇన్‌ఫ్లమేటరీ, యాంటి బ్యాక్టీరియల్, యాంటి క్యాన్సర్, యాంటి డయాబెటిక్ లక్షణాలు అధికం. ఇవి.. వివిధ వ్యాధులను దరిచేరనీయకుండా.. మన ఆరోగ్యానికి భరోసా కల్పిస్తాయి. తాటిముంజల్లో నీటి శాతం ఎక్కువ. కాబట్టి, వేసవిలో డీహైడ్రేషన్‌ను సమర్థంగా నివారిస్తాయి. వడదెబ్బకు గురైనవారికి తక్షణ ఉపశమనం అందిస్తాయి. శరీరానికి కావాల్సిన మినరల్స్, చక్కెర పదార్థాలను సమతుల్యం చేస్తాయి. శరీరాన్ని చల్లబరచడంతోపాటు రోగ నిరోధక శక్తిని పెంచడంలోనూ సహాయపడతాయి. ఇందులో అధికంగా లభించే ఫైబర్.. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది.ఇక తక్కువ కేలరీలతో కూడిన తాటిముంజలు బరువు తగ్గడంలోనూ సాయపడతాయి. ముంజల్లో లభించే యాంటి ఆక్సిడెంట్లు.. చర్మ ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. ఫైటోకెమికల్స్, ఆంథోసయనిన్ లాంటివి శరీరంలో వివిధ రకాల ట్యూమర్స్, బ్రెస్ట్ క్యాన్సర్ కణాలను అభివృద్ధి చేస్తాయి. వీటిని తాటి ముంజలు నిర్మూలిస్తాయని పలు పరిశోధనల్లో తేలింది. అందుకే, ఐస్ యాపిల్స్‌ను రెగ్యులర్‌గా



తినేవారు.. వివిధ క్యాన్సర్ల బారిన పడకుండా ఉంటారని పరిశోధకులు చెబుతున్నారు. ఇక ఇందులోని పొటాషియం.. కాలేయ సంబంధ వ్యాధులను తగ్గిస్తుంది.ఇక చాలామంది గర్భిణులు మలబద్ధకం, అసిడిటీ సమస్యతో బాధపడుతుంటారు. అలాంటివాళ్లు తాటిముంజలను తీసుకుంటే.. వారి జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. అసిడిటీ, మలబద్ధకం తగ్గుముఖం పడతాయి. ఎండల్లో తిరగడం వల్ల ముఖంపై వచ్చే చిన్నచిన్న మొటిమల్లాంటి పొక్కులను తాటి ముంజలు సమర్థంగా అడ్డుకుంటాయి. అయితే, కొందరు ముంజలపై గోధుమ రంగులో ఉండే పొట్టును తీసేసి.. కేవలం తెల్లటి పదార్థాన్ని మాత్రమే తింటారు. కానీ, ఆ పొట్టులోనే ఎన్నో రకాల పోషకాలుంటాయని, అది ఆరోగ్యానికి మరింత మంచిదంటున్నారు నిపుణులు.

# తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక నిధులు

## జగిత్యాల మున్సిపల్‌కు తీసుకువచ్చాం : జగిత్యాల శాసనసభ్యులు

**నేటి కేసరి జగిత్యాల ప్రతినిధి మే 30:**

తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక నిధులు జగిత్యాల మున్సిపల్ కు తీసుకురావడం జరిగిందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని 16వ వార్డులో సీఎస్ఐ చర్చిలో 5లక్షలతో సిసి రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలించి, 25వ వార్డులో 8లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం రోజున జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ పరిశీలించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ

జగిత్యాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తా అన్నారు.16వ వార్డులో దాదాపు 2.5 కోట్ల,25వార్డులో 2కోట్ల పనులు చేయటం జరిగిందని తెలిపారు.



అభివృద్ధి సంక్షేమం లో తెలంగాణ దేశానికి ఆదర్శం అన్నారు.రాష్ట్రం లో ఎక్కడాలేని విధంగా 4520 డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం తో పేదల సొంతింటి కల సాకారం అయిందన్నారు.అర్హుల అందరికీ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేస్తామన్నారు. జగిత్యాల పట్టణం లో 18వేల ఇండ్లకు ఉచిత కరెంట్,ఉచిత బస్,,200యూనిట్ల ఉచిత కరెంట్,కళ్యాణ లక్ష్మీ,సన్న బియ్యం పంపిణీ,రాజీవ్ యువ వికాసం, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు .14జోన్ల లో 126 సర్వే నంబర్ లను మార్చడం ద్వారా చట్టబద్ధ అనుమతులు వస్తున్నాయి అన్నారు.బీట్ బజార్ మార్కెట్ అతి త్వరలోనే ప్రారంభం అవుతుందని తెలిపారు.ప్రజలు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని సూచించారు.ఇష్టారీతిన నిర్మాణాలు చేపట్టడం వల్ల రానున్న వర్షాకాలం లో కొన్ని వార్డులు జలమయం అయ్యే అవకాశం ఉందని,ప్రజల సహకారం తోనే పట్టణం అభివృద్ధి సాధ్యం అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం ,కూతురు రాజేష్,కుసరి అనిల్, ఆరుముల్ల నర్సమ్మ,కోరే గంగ మల్లు ,రాజకుమార్,డి ఇ వరుణ్,ఏఈ లు శరన్,అనిల్,గ ంమ్ముల అంజయ్యా,కోటేశ్వర రావు,శివనూరి రాకేష్,కొలగాని సత్యం,పెద్దింటి రాజు, దుమాల రాజ్ కుమార్,గంగారాం, సునంద్, స్టీవెన్ పుత్రయ, దయానంద్, సురేందర్ విజయరాజ్ కనకరాజు మోజేష్,ఆరిఫ్,రవి శంకర్ పోతునుక మహేష్ గట్టురాజు,అభి,రవి,క్రాంతి, నాయకులు, మహిళలు, తదితరులు, పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి వ్యాఖ్యలు అర్ధరహితం

### –పాకిస్తాన్ ఒప్పుకున్న కాంగ్రెస్ ఒప్పుకోవడం లేదు, –బిజెపి జగిత్యాల జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్...

**నేటి కేసరి జగిత్యాల క్రైమ్ మే 30**

ఆపరేషన్ సింధూర్ ద్వారా పాకిస్తాన్ కు జరిగిన ధన, మాన, ప్రాణ నష్టాన్ని పాకిస్తాన్ ఒప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ మాత్రం ఒప్పుకోవడం లేదని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యమ్ విమర్శించారు. పహల్గామ్ సంఘటన జరిగి పదిహేను రోజులు గడువక ముందే పాకిస్తాన్ లోని తొమ్మిది తీవ్రవాద స్థావరాలను పెల్చివేసి పదకొండు ఎయిర్ బేస్ లను కూల్చివేచి 170 మందికి పైగా తీవ్రవాదులను మట్టి కరిపించి నలభై రెండు మంది పాక్ ఆర్మీని చంపి తగిన బుద్ధి చెప్పితే పాకిస్తాన్ కాళ్ళ బేరానికి వస్తే సీజ్ ఫైర్ చేసినందుకు కాంగ్రెస్ పార్టీకి వచ్చిన నొప్పి ఏంటని ప్రశ్నించారు.కాంగ్రెస్ హయాంలో చైనా ఆక్రమించిన భారత భూభాగాన్ని నరేంద్ర మోదీ హయాంలో జరిగినట్లు ముఖ్యమంత్రి హోదాలో తప్పుడు ప్రచారం చేయడం దేశాన్ని అవమానించడమేనని వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సత్యం డిమాండ్ చేశారు.సీజ్ ఫైర్ విషయంలో ఏదేశం ప్రమేయం లేదని ప్రధానమంత్రి, హోమ్ శాఖ మంత్రి, రక్షణ శాఖ మంత్రి స్పష్టంగా చెప్పినప్పటికి అదే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు పదే పదే వల్లే వేయడం స్వదేశాన్ని అవమానించడమేనని అన్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా చివరి రోజున జమ్ము కాశ్మీర్ లో ఉగ్రవాదులను దగ్గరినుండి చూశానని వాళ్ళు నాతో మాట్లాడాలని అన్నారని చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతమో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాకిస్తాన్ కు చెందిన ఉగ్రవాదులకు భారత్ లో ఉన్న కాంగ్రెస్ నాయకులు ఏమైనా అన్నదమ్ముల కొడుకులా అని ప్రశ్నించారు. ఉగ్రవాదుల గురించి మాట్లాడే కాంగ్రెస్ నాయకులు ఉగ్రవాదులు రాహుల్ ను కలిసి మాట్లాడాలి అన్న విషయంలో ఎందుకు స్పందించడం లేదన్నారు.దేశ సైనికులను అవమానిస్తున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సైనికులకు స్వేచ్ఛ లేదని కాల్పులు జరపాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరని అందుకే వేలాది సైనికులు మరణించారని అన్నారు. ఇంటి దొంగను ఈశ్వరుడు అయినా పట్టలేడు అన్న చందంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహారం ఉందని ఎద్దేవాచేశారు.పాకిస్తాన్ తో యుద్ధం ఎందుకు జరుపలేదని ప్రశ్నించిన రాహుల్ ఇందిరమ్మ హయాంలో పాకిస్తాన్ తో జరిగిన యుద్ధంలో ఇందిరాగాంధీ నిర్ణయం భేష్ అంటున్న రాహుల్ మరి అదే సమయంలో పాక్ ఆక్రమిత కాశ్మీర్ ను ఎందుకు స్వాదీనం చేసుకోలేదో సమాధానం చెప్పాలన్నారు. దేశ రక్షణకు సంబందించిన రహస్యాలు గోప్యంగా ఉంచుతారని అవి ఎవరికి చెప్పాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు పాకిస్తాన్ లో ఎక్కువ ట్రెండ్ అవుతున్నాయంటే కాంగ్రెస్ పార్టీలో పాకిస్తాన్



ప్రేమికులు ఎక్కువగా ఉన్నారని అర్థం అవుతుందని అన్నారు. .రాహుల్, రేవంతుల రాశిఫలాలు ఫలాలు ఒక్కటేనని వారికి శనిగ్రహం సోకిందని అందుకే మతి భ్రమించినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు.

# తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీలను జూన్ 2,తేదీ న అమలు చేయాలి

### తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జగిత్యాల జిల్లా చైర్మన్ జవ్వాజి శంకర్

**నేటి కేసరి జగిత్యాల మే 30**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ చౌరస్తా లో ని ఇందిరా గాంధీ విగ్రహానికి జగిత్యాల జిల్లా ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో తెలంగాణ అవతరణ దినోత్సవ సందర్భంగా ప్రభుత్వం నిర్వహించే అవతరణ దినోత్సవ వేడుకల్లో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని ఉద్యమకారుల సంక్షేమంపై స్పష్టమైనటువంటి వైఖరి ప్రకటించాలని శుక్రవారం రోజున వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో జవ్వాజి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారుల అంశం చేర్చడం శుభపరిణామం అదేవిధంగా ఇచ్చినటువంటి హామీలను తెలంగాణ అవతరణ దినోత్సవ సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో అధికారికంగా స్పష్టమైన వైఖరి తెలపాలని శుక్రవారం రోజున ఇందిరమ్మ విగ్రహానికి వినతి పత్రం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం పై ఒక విశ్వాసం తెలంగాణ ఉద్యమకారులకు ఉన్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాజుల శ్రీనివాస్ గౌడ్,వైస్ చైర్మన్ రాగుల రాజు ఉపాధ్యక్షులు తన్నీర్ సత్యం రావు ప్రధాన కార్యదర్శి కొండ్రా ప్రేమ్ కుమార్ అరుముల్లా ఉమేందర్ లాసగోని మల్లేశం గాలిపెల్లి సత్తవ్వ ఆకుల రాజు తరాల విజయ నడిపెల్లి సత్యవతి రామిళ్ల లావణ్య తదితరులు పాల్గొన్నారు



# నడిపేది రోడ్డు సైడ్ డాబా హొటల్ అనుకునేరు.. లోపల యవ్వారం చూస్తే సీన్ సితారే



**హైదరాబాద్ – నేటి కేసరి ప్రతినిధి**

చూడటానికి అదొక రోడ్డు సైడ్ డాబా.. ఏముంటాయ్ తినడానికి పరోటాలు, బిర్యానీ అని అనుకోవచ్చు. కానీ పైన పటారం లోన లొటారం.. అసలు ఆ డాబా హొటల్‌లో ఏమున్నాయో తెలిస్తే మీకే మైండ్ బ్లాంక్ అవుతుంది. ఆ వివరాలు ఇప్పుడు చూసేయండి. శంషాబాద్ రాయికల్ టోల్ గేట్ వద్ద భారీ డ్రగ్స్ రవాణా గుట్టు రట్టు అయింది. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి వెల్లడించిన వివరాల ప్రకారం, డ్రగ్స్ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. హెరాయిన్ 1/2 కిలో, గంజాయి, ఓపీఎం డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన డ్రగ్స్ విలువ రూ. 3 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. షాద్‌నగర్‌లోని సంజు భాయ్ మార్వాడి డాబాలో డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు నిఘా సమాచారం ఆధారంగా గుర్తించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు డ్రగ్స్ రవాణా చేస్తుండగా పట్టుబడ్డారు. డాబా వంట మనిషి డ్రగ్స్‌ను రాజస్థాన్ నుండి తెచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఒక్క గ్రాము హెరాయిన్‌ను నగరంలో రూ. 15,000 ధరకు విక్రయిస్తున్నారు. డ్రగ్స్ రవాణా కోసం నిందితులు బస్సులను ఉపయోగిస్తున్నారు. నిందితులు వికాస్ షో, సంజు భాయ్ గతంలోనూ డ్రగ్స్ కేసుల్లో అరెస్టు అయ్యారని పోలీసులు తెలిపారు. ఏప్రిల్‌లో డాబా యజమాని మరణం తర్వాత వికాస్ హొటల్ నిర్వహణను చేపట్టి.. డ్రగ్ దందా నిర్వహిస్తున్నాడు. డ్రగ్స్ కొనుగోలు చేసిన కస్టమర్ వివరాలను సేకరిస్తున్నారు. డ్రగ్స్ రవాణాకు ఉపయోగిస్తున్న నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ దాడితో డ్రగ్స్ రవాణా చేసే ప్రధాన మార్గాలను గుర్తించి చర్యలు తీసుకోవడం మొదలు పెట్టామని సీపీ అవినాష్ మహంతి పేర్కొన్నారు. ఈ ఘటన డ్రగ్స్ విక్రయ వ్యవస్థపై మరింత లోతుగా దర్యాప్తు జరపవలసిన అవసరాన్ని చూపిస్తోంది.

# జగిత్యాల జిల్లాలో అధికారులు ప్రోటోకాల్ తప్పకుండా పాటించాలి

### –: జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్

**నేటి కేసరి జగిత్యాల మే 30:**



జగిత్యాల జిల్లాలో వివిధ సందర్భాలలో అధికారులు ప్రోటోకాల్ తప్పకుండా పాటించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అన్నారు. ప్రభుత్వ నిర్దేశంలో క్రమం ఏవైనా శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు ప్రభుత్వ కార్యక్రమాలలో సంబంధిత ప్రజాప్రతినిధులను ప్రోటోకాల్ క్రమం వారికి సంబంధించి ఫోటో, శిలాఫలకాలపై పేరును ప్రోటోకాల్ క్రమం ఏర్పాటు చేయాలని, ప్రోటోకాల్ విషయంలో ఎలాంటి తప్పిదములకు ఆస్కారం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 28 మే 2025 రోజున బందలింగపూర్ గ్రామం రాయికల్ మండలం నందు ప్రోటోకాల్ క్రమం శిలాఫలకంలో పార్లమెంట్ సభ్యులు పేరు ప్రోటోకాల్ క్రమం లేనందున డిప్యూటీ ఈ దబ్ల్యుహెచ్డీ మెదక్ కి సంజాయిషీ మేమో కోరడం జరిగినది అన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యము వేగవంతంగా కొనుగోలు చేయాలి

### – పలు గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్



**నేటి కేసరి జగిత్యాల మే 30**

జగిత్యాల జిల్లాలోని బీర్పూర్ మండల కేంద్రంలోని చర్లపల్లి, కందెనకుంట గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పెండింగ్ ఉండకుండా ధాన్యం కొనుగోలను వేగవంతంగా స్పీడ్ ఆఫ్ చేయాలని శుక్రవారం రోజున జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. వరి ధాన్యం సెంటర్లలో ఉన్న అటువంటి. ఇన్చార్జిలను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని వెంట వెంటనే ధాన్యము ను రైస్ మిల్లర్లకు తరలించాలి అన్లోడ్ వెంటనే చేయించాలి వెంటనే ట్యాబ్ డాటా ఎంట్రీ చెయ్యాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలని కలెక్టర్ అన్నారు. అదేవిధంగా అధికారులు అలసత్వం వహించి నట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.జిల్లా కలెక్టర్ స్వయంగా రైతులతో మాట్లాడి వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ధాన్యము కొనుగోలు చేసిన వెంటనేత్వరగా మిల్లర్లకు పంపిస్తామని రైతులు ఎలాంటి ఇబ్బందులు వద్దని అన్ని ఏర్పాట్లు లారీ లోడింగ్ అయిన వెంటనే మిల్లులకు పంపుతాం అని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రెవిన్యూ డివిజనల్ అధికారి మధు సూదన్ బీర్పూర్ తహసిల్దార్ సుజాత సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

### –స్వాధీనంలోకి జగిత్యాల నాల్గవ తరగతి సంఘ కార్యాలయము.



**నేటి కేసరి జగిత్యాల ప్రతినిధి మే 30:**

తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జగిత్యాల జిల్లా కార్యాలయంను కొత్తగా ఎన్నికైన నూతన కార్యవర్గం జిల్లా అధ్యక్షురాలు కె.అరుణ ఆధ్వర్యంలో శుక్రవారం స్వాధీనం లోకి తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షురాలు అరుణ మాట్లాడుతూ నూతన కార్యవర్గం గా మేము ఎన్నికయ్యామని,నెల రోజులు కావస్తున్నా పాత కార్యవర్గం సంఘ భవనాన్ని స్వాధీనం చేయక పోవడంతో సాధారణ సభ్యులు,విలేకరుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాలోని నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తామని,రాష్ట్ర సంఘం ఏ పిలుపు నిచ్చినా విజయవంతం చేస్తామని తెలిపారు .జిల్లాలోని నాల్గవ తరగతి ఉద్యోగులు ఏ సమస్యలు వచ్చినా తమకు తెలిపితే పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఉమ్మడి నారాయణ,అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.రాజేందర్,ట్రెజరర్ ఎం.డి.నసీరోద్దీన్,జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇస్రో శిక్షణకు ఎంపికైన జగిత్యాల జిల్లా విద్యార్థులు

**నేటి కేసరి జగిత్యాల మే 30**

భావి భారత శాస్త్రవేత్తలను తీర్చిదిద్దడానికి ఇస్రో సమ్మర్ క్యాంప్ కోసం 100 మంది విద్యార్థులను సెలెక్ట్ చేసింది. వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తుల నివారణ సాంకేతికతను బోధించడానికి డెహ్రాడూన్లో శిక్షణ ఇవ్వనుంది. జూన్ 23 నుంచి ప్రారంభమయ్యే ఈ ట్రైనింగ్కు జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం వెలుగొండ గ్రామానికి చెందిన జెడ్ పి హెచ్ ఎస్ విద్యార్థులు సౌజన్య, అశ్విత్ కుమార్ ఎంపికయ్యారు.

# మినీ గురుకులం ఒడ్డే లింగాపూర్,మల్లాపూర్ 2025-26 సంవత్సరానికి ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి దరఖాస్తుల ఆహ్వానం

**నేటి కేసరి జగిత్యాల ప్రతినిధి మే 30:**

జగిత్యాల జిల్లా లోని మిని గురుకులం, ఒడ్డేలింగాపూర్ మల్లాపూర్ 2025-26 సంవత్సరమునకు ఇంగ్లీషు మీడియంలలో ఖాళీగా వున్న 1వతరగతి 60,2వ తరగతి 3వతరగతి 01, 5వతరగతి 25 సీట్ల ప్రవేశాల కోరకు దరఖాస్తు ఆహ్వానిస్తునట్లు జన సంక్షేమ గురుకుల ప్రాంతీయ సమన్వాధికారి

డి. యస్. వెంకన్న తెలిపారు. ఆసక్తి గల గిరిజన విద్యార్థినిల తల్లిదండ్రులు మిని గురుకులం, ఒడ్డేలింగాపూర్ 06.06.2025 లోగా దరఖస్తులు సమర్పించవలెనని తెలిపారు. ఇతర వివరాల కోరకు సెల్. 2141962, 9705916567. కోరారు.

# పెసర ఉప్మా బైట్స్

ద
కావలసిన పదార్థాలు
ఉప్మారవ్వ: కప్పు
పెసర్లు: రెండు కప్పు
బియ్యం: అరకప్పు
జీలకర్ర: పావు స్పూను
అల్లం : చిన్న ముక్క
పచ్చిమిరపకాయలు: రెండు
పోపు గింజలు: స్పూను
నూనె: టేబుల్ స్పూను
ఉప్పు: తగినంత

తయారీ విధానం: పెసర ఉప్మా బైట్స్ కోసం పెసలు, బియ్యం కలిపి రెండు గంటల పాటు నానబెట్టుకోవాలి. తర్వాత పచ్చిమిరప, అల్లం, జీలకర్ర, కొద్దిగా ఉప్పు వేసి గ్రైండ్ చేసి పక్కకు పెట్టుకోవాలి. పొయ్యి మీద చిన్న గిన్నె పెట్టి అందులో నూనె వేసి కాగాక పోపు గింజలు వేయాలి. అందులో రెండున్నర కప్పుల నీళ్లు పోసి, ఉప్మాకు తగినంత ఉప్పు వేసి ఉప్మారవ్వ పోసి ఉండలు కట్టకుండా కలపాలి. ఉడికిన తర్వాత దించేయాలి. ఇది కాస్త జారుడుగా ఉంటే మేలు. ఇప్పుడు పొయ్యి మీద పెనం పెట్టి పెసరపిండి అట్టు పోసి, ఉప్మా దాని మీద పల్చగా రాయాలి. తీసిన తర్వాత రోల్‌లాగా గుండ్రంగా చుట్టి, రెండు అంగుళాల ముక్కలుగా కోసి మరోసారి పెనం మీద రెండు వైపులా వేయించాలి. చట్నీతో సర్వ్ చేస్తే టిఫిన్ పెసరట్టు కాస్తా స్నాక్ పెసర ఉప్మా అయిపోతుంది!



# ద్రాక్ష కారం

**ద్రాక్ష కారం ఎండుద్రాక్షలు, ఎండు మిరపకాయలను ఒక గిన్నెలో వేసి, వేడి నీళ్లు పోసి ఒక పావు గంట నానబెట్టుకోవాలి. వీలైతే ఇక్కడ ఎండు మిరప స్థానంలో, పండు మిరపకాయలు కూడా వాడవచ్చు. అవి అయితే నానబెట్టనక్కర్లేదు.**

ద్రాక్ష కారం
కావలసిన పదార్థాలు:
ఎండుద్రాక్ష: ఒక కప్పు
నిమ్మకాయలు: రెండు
బెల్లం: చిన్న ముక్క (ఇష్టముంటే)
ఎండు మిరపకాయలు: నాలుగైదు (పండు మిరపకాయలైనా సరే)
ఉప్పు: తగినంత

తయారీ విధానం:ఎండుద్రాక్షలు, ఎండు మిరపకాయలను ఒక గిన్నెలో వేసి, వేడి నీళ్లు పోసి ఒక పావు గంట నానబెట్టుకోవాలి. వీలైతే ఇక్కడ ఎండు మిరప స్థానంలో, పండు మిరపకాయలు కూడా వాడవచ్చు. అవి అయితే నానబెట్టనక్కర్లేదు. ద్రాక్ష మెత్తబడ్డాక%ౌ% నీళ్లలోంచి తీసి, మిరపకాయలతో కలిపి మెత్తగా గ్రైండ్ చేయాలి. అందులో కొద్దిగా ఉప్పు, రెండు నిమ్మకాయల రసం పిండి కలపి మరోసారి తిప్పాలి. ఇష్టమున్న వాళ్లు వీటితో పాటుగానే చిన్న బెల్లం ముక్కను కూడా వేసి మిక్సీ పట్టుకోవచ్చు. తియ్య తియ్యగా, పుల్ల పుల్లగా, కారం కారంగా ఉండే ఈ చట్నీ చపాతీలు, పరాటాలు, దోశల్లాంటి వాటికి సూపర్ కాంబినేషన్‌లా ఉంటుంది. బ్రెడ్ మీద రాసుకుని తిన్నా బాగుంటుంది.



# మష్రూమ్ టోస్ట్

కావలసిన పదార్థాలు
మష్రూమ్స్ (పుట్టగొడుగులు): ఒక కప్పు, బ్రెడ్‌ట్కస్లెసెస్: నాలుగు, ఉల్లిగడ్డ: ఒకటి, క్యాప్సికమ్: ఒకటి, వెన్న: అర కప్పు, క్రీమ్ చీజ్: అర కప్పు, మిరియాల పొడి: అర టీస్పూన్, ఉప్పు: తగినంత, వెల్లుల్లి రెబ్బలు: నాలుగు.

తయారీ విధానం..మష్రూమ్స్‌ను ముక్కలుగా చేసుకోవాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి ఒక టేబుల్ స్పూన్ వెన్న వేసి వేడయ్యాక సన్నగా తరిగిన వెల్లుల్లి, మష్రూమ్ ముక్కలు, క్యాప్సికమ్, ఉల్లిగడ్డ ముక్కలు వేసి బాగా వేయించాలి. అన్నీ బాగా వేగాక మిరియాల పొడి, ఉప్పు వేసి మరో రెండు నిమిషాలు వేయించి దించేయాలి. బ్రెడ్ ట్కస్లైస్‌పై క్రీమ్ చీజ్ రాసి, మష్రూమ్ మిశ్రమం పరిచి, పైనుంచి మరో ట్కస్లైస్ ఉంచాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి, అప్పటికే తయారు చేసి పెట్టుకున్న బ్రెడ్ ట్కస్లెసెస్‌ను రెండు వైపులా వెన్న వేసి కాల్చుకుంటే మష్రూమ్ టోస్ట్ రెడీ.




# స్లిమ్‌గా.. స్టైలిష్‌గా..

ఒకప్పుడు కేవలం కాల్స్ చేయడానికి, మెసేజ్‌లు పంపడం కోసమే ఫోన్ వాడేవాళ్లం. ఇప్పుడు.. అదే ఫోన్ కంటెంట్ సృష్టిస్తున్నది. మన పనులన్నీ చకచకా చేసేస్తున్నది. మన రోజువారీ జీవితాన్ని ప్రపంచంతో ముడివేస్తున్నది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ రాకతో ఈ బంధం మరింత బలపడింది. ఈ క్రమంలో సామ్‌సంగ్ తీసుకొస్తున్న గెలాక్సీ ఎస్25 ఎడ్జ్ 'ఫోన్ అంటే ఇది' అనిపించేలా చేస్తున్నది. సరికొత్త ఏఐ ఇముడ్చుకున్న ఈ స్మార్ట్‌ఫోన్.. వ్యక్తిగత సహాయకుడిగా మారిపోతున్నది. ఇక డిజైనింగ్ విషయానికి వస్తే స్లిమ్‌లుక్‌తో ట్కస్టైలిష్‌గా కనువిందు చేస్తున్నది. ఈ ఫోన్ మందం కేవలం 5.85 మిల్లీమీటర్లు మాత్రమే. ఇందులో చెప్పుకోదగిన మరో అప్‌డేట్.. 200 మెగాపిక్సెల్ కెమెరా! గెలాక్సీ ఏఐ సాయంతో ఈ కెమెరా ప్రతి దృశ్యాన్ని అద్భుతంగా మార్చేయగలదు. మీరు తీసిన ఫొటోలను చక్కని స్టోరీలా మార్చేస్తుంది కూడా!



ఏదైనా పెళ్లికి వెళ్లినప్పుడు ఓ పది ఫొటోలు తీశారే అనుకోండి.. వాటన్నిటినీ కలిపి చక్కని స్టోరీ రీల్ చేసేస్తుంది. ఈ కెమెరాతో 8%ఖ% వీడియోలు తీయొచ్చు. ఇక ఇతర స్పెసిఫికేషన్స్ విషయానికొస్తే.. స్లిమ్ ఫోన్ బరువు 163 గ్రాములు. ఫ్లాట్-ఫ్రేమ్ డిజైన్‌తో ముస్తాబయ్యింది. స్క్రీన్ పొడవు 6.7 అంగుళాలు. అమొలెడ్ డిస్‌ప్లే, గొరిల్లా గ్లాస్ సెరామిక్ 2 ప్రొటెక్షన్‌తో దృఢంగా తయారైంది. స్నాప్‌డ్రాగన్ 8 ఎలీట్ ప్రాసెసర్, 12 జీబీ రామ్, 512 జీబీ స్టోరేజీతో ఇతర స్పెసిఫికేషన్లు! 3,900 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. ఫొటోగ్రఫీ లవర్స్, టెకీలకు ఇది చక్కని ఎంపిక. దీని అంచనా ధర: రూ.79,999.

# ఎండలో పావుగంటైనా..



నమస్తే మేడం. వేసవిలో ఎండలు ఎక్కువగా ఉంటాయి కదా! ఇతర దేశాల్లాగే మనమూ ఈ సమయంలో శరీరానికి విటమిన్-డిని ఎక్కువగా అందించవచ్చా. అలా అయితే ఏ సమయంలో ఎండలో గడపాలి. దాన్ని శోషించుకునేందుకు ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుపగలరు.మనది సమశీతోష్ణ మండలం. చక్కగా సూర్యుడు ప్రతిరోజూ ఉదయించి ఎన్నో గంటలు ఉంటాడు. నిజానికి ఇలాంటి వాతావరణంలో విటమిన్-డి లోపం రాకూడదు. కానీ మనం కేవలం నీడ పట్టునే ఉండటం వల్ల ఈ సమస్య వస్తుంది. సహజంగా సూర్యకాంతి నేరుగా చర్మానికి తాకినప్పుడు శరీరంలో విటమిన్-డి ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఒక రోజులో కనీసం పావుగంట ఇలా శరీరం మీద ఎండ పడేలా చూసుకోవాలి. భారతదేశంలో ఉన్నవాళ్లకు ఏడాదంతా విటమిన్-డి వస్తుంది.మంచు దేశాల్లోలాగా మనకు ఎండకాలంలో మాత్రమే ప్రత్యేకంగా ఇది అందుతుంది అన్నది ఏం ఉండదు. కాకపోతే వేసవిలో పగటి సమయం ఎక్కువగా ఉండటం వల్ల సాధారణం కన్నా ఎక్కువగా ఎండకు ఎక్స్‌పోజ్ అవుతాం. కాబట్టి ఈ సమయంలో విటమిన్ స్థాయులు పెరుగుతాయి. ఇక, వేసవిలో విటమిన్-డి కావాలనుకున్నప్పుడు ఉదయం ఆరున్నర ఏడు నుంచి తొమ్మిది గంటల మధ్య, సాయంకాలం అయిదు తర్వాత ఎండలో ఉండటం మంచిది. వేడి ఎక్కువ ఉన్న సమయంలో బయటికి వెళ్లకపోవడమే ఉత్తమం. లేకపోతే శరీరం డీ హైడ్రేషన్ బారినపడే ప్రమాదం ఉంటుంది. ఇక విటమిన్-డి శోషణలో చర్మపు రంగు అన్నది కూడా ముఖ్యమే. అంటే లేత రంగు చర్మ ఛాయ ఉన్నవాళ్లతో పోలిస్తే ముదురు రంగు చర్మం ఉన్నవాళ్లలో డి విటమిన్ శోషణకు ఎక్కువ సమయం పడుతుంది. అందుకే తెల్లవాళ్లతో పోలిస్తే మనలాంటి ఆసియా దేశాల వారు మరికాస్త ఎక్కువ సేపు ఎండలో గడపాలి. అలాగే విటమిన్-డి మన శరీరంలో సమృద్ధిగా తయారవ్వాలంటే పండ్లూ, ఆకుకూరలూ, మాంసకృత్తులూ కలగలిపిన సమతులాహారం తీసుకోవడం తప్పనిసరి.

# ఇంట్లోనే సముద్ర స్నానం

ఏడాదికి ఒక్కసారైనా సముద్ర స్నానం చేయాలని పెద్దలు అంటుంటారు. శాస్త్రపరంగా ఎలా ఉన్నా.. సైన్స్ పరంగా మాత్రం సాగర స్నానంతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, సముద్ర స్నానం వీలుకానివాళ్లు.. ఇంట్లో నీటిలోనే కొద్దిగా ఉప్పును కలుపుకోవాలని సలహా ఇస్తున్నారు. 'ఉప్పు నీటి' స్నానం.. ఆరోగ్యానికి అనేక విధాలుగా మంచిదని అంటున్నారు. జోర్డాన్ సరిహద్దులో ఉండే డెడ్‌సీ (మృత సముద్రం) సందర్శనకు ఏటా లక్షలమంది పర్యాటకులు తరలివస్తుంటారు. లవణీయత (ఉప్పు శాతం) అత్యధికంగా ఉండే ఈ సముద్రపు నీటితో స్నానం చేస్తే.. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని అనేక పరిశోధనల్లోనూ తేలింది. మరి.. ఇలాంటి ప్రయోజనాలే ఇంట్లోనే పొందాలంటే.. నీటిలో కొద్దిగా ఉప్పు కలుపుకొంటే చాలు. మెగ్నీషియం, క్యాల్షియం, పొటాషియం వంటి అనేక ఖనిజాలతో నిండి ఉండే ఉప్పు.. శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. ఉప్పు నీటితో స్నానం చేయడం వల్ల చర్మంపై ఉండే మృతకణాలు పూర్తిగా తొలగిపోతాయి. వేసవిలో చెమట అధికంగా పడుతుంది. దీనివల్ల రింగ్‌వార్మ్, దురద లాంటి చర్మ వ్యాధులు ఇబ్బంది పెడతాయి. ఉప్పు నీటితో స్నానం.. చర్మ వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. ఉప్పులో ఉండే యాంటి బ్యాక్టీరియల్ లక్షణాలు.. ఇన్ఫెక్షన్ల నుంచి చర్మాన్ని కాపాడతాయి. చర్మాన్ని మరింత ప్రకాశవంతంగా మారుస్తాయి. కీళ్ల నొప్పులు, వెన్నునొప్పుల నుంచి ఉప్పునీటి స్నానం ఉపశమనం కలిగిస్తుంది. గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఉప్పు కలిపి స్నానం చేస్తే.. వాపులు కూడా తగ్గుతాయి. ప్రతిరోజూ స్నానం చేసే నీటిలో చిటికెడు ఉప్పును కలిపేస్తే.. అలసట, ఒత్తిడి దూరం అవుతుంది.



శరీరానికి కొత్త ఉత్సాహం వస్తుంది. శరీరంలో మంట, దురద, వాపు వంటి సమస్యలను తగ్గించడంలోనూ ఉప్పునీటి స్నానం సాయపడుతుంది.



# ఈసారి గట్టిగానే ప్లాన్ చేసినట్లు ఉన్నారుగా! ది కంజురింగ్

హర్రర్ చిత్రాలను ఇష్టపడే వారి కోసం ది కంజురింగ్: లాస్ట్ రైట్స్ అనే హాలీవుడ్ సినిమా సిద్ధమవుతోంది. తాజాగా ఈ మూవీ తెలుగు టీజర్‌ను విడుదల చేశారు. ఈ సినిమా 2021లో వచ్చిన ది కంజురింగ్ ది డెవిల్ మేడ్ మీ డూ ఇట్ చిత్రానికి సీక్వెల్‌గా కాగా టోటల్ కంజురింగ్ మూవీస్‌లో తొమ్మిదో ఇన్‌స్టాల్మెంట్ కావడం విశేషం. వాస్తవ ఘటనలరు ఆధారంగా చేసుకుని రూపొందించిన ఈ మూవీని మైఖేల్ చావ్స్ దర్శకత్వం వహించాడు. వెరా ఫార్మిగా పాట్రిక్ విల్సన్, మియా టాంలిన్సన్ , బెన్ హార్డీ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ టీజర్‌ను చూస్తే పాత చిత్రాలను మించి భయపేట్టేలా ఉంది. కాగా ఈ చిత్రం సెప్టెంబర్‌లో ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.






# భారతీయ సినిమాలో మీరు.. మాకు సిగ్గుచేటు

భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై పాకిస్థాన్ నటుడు ఫవాద్ ఖాన్ చేసిన వ్యాఖ్యలను బాలీవుడ్ నటి రూపాలీ గంగూలీ పహల్గాం దాడులకు ప్రతీకారం తీర్చుకునేందుకు భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై పాకిస్థాన్ నటుడు ఫవాద్ ఖాన్ చేసిన వ్యాఖ్యలను బాలీవుడ్ నటి రూపాలీ గంగూలీ ఖండించారు. సోషల్ మీడియా వేదికగా ఫవాద్‌ను విమర్శిస్తూ పోస్ట్ పెట్టారు. "మీలాంటి వాళ్లు భారతీయ సినిమాల్లో పనిచేయడం మాకు సిగ్గుచేటు" అని అతని ఫొటో షేర్ చేశారు. ఈ పోస్ట్‌కు ఆపరేషన్ సిందూర్, ఇండియన్ ఆర్మీ, ఇండఇయన్ ఎయిర్‌ఫోర్స్ హ్యాష్ ట్యాగ్‌ను ఆమె జోడించారు.'ఆపరేషన్ సిందూర్'పై పాకిస్థానీ నటీనటులు ఫవాద్‌ఖాన్, మహిరా ఖాన్ చేసిన వ్యాఖ్యలను ఆల్ ఇండియా సినీ వర్కర్స్ అసోసియేషన్ కూడా ఖండించింది. చిత్ర పరిశ్రమ నుంచి వారిని తక్షణమే బహిష్కరించాలని పిలుపునిచ్చింది. కళల పేరుతో ఇలాంటి వారికి గుడ్డిగా మద్దతు ఇవ్వొద్దని చిత్ర పరిశ్రమను అసోసియేషన్ కోరింది. పహల్గాంలో దాడి జరిగిన తర్వాత ఫవాద్ ఖాన్ హీరోగా నటించిన 'అబీర్ గులాల్' సినిమాను భారత్‌లో బ్యాన్ చేసిన విషయం తెలిసిందే.



# సమంత నిర్మించిన 'శుభం' సినిమా ఎలా ఉందంటే..

సమంత నిర్మాతగా మారి తెరకెక్కించిన తొలి చిత్రం 'శుభం'. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో హారర్ కామెడీ థ్రిల్లర్ గా రూపొందిన ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నిర్మాత గా సమంత విజయం అందుకుందా..

సినిమా రివ్యూ: శుభం

%విడుదల తేది: 9-5-2025

స్టార్ హీరోయిన్ గా రాణించిన సమంత సొంత నిర్మాణ సంస్థను నెలకొల్పి సినిమా నిర్మాణం చేపట్టింది. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై సమంత నిర్మించిన తొలి చిత్రం 'శుభం'. సినిమా బండి' కి దర్శకత్వం వహించిన ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించటంతో పాటు సమంతకు నిర్మాతగా తొలి చిత్రం కావటంతో 'శుభం'పై రిలీజ్ కి ముందు పాజిటివ్ వైబ్స్ ఏర్పడ్డాయి. మరి శుక్రవారం ఆడియన్స్ ముందుకు వచ్చిన ఈ సినిమాకు ఎలాంటి స్పందన లభిస్తుందో ఇప్పుడు చూద్దాం.

కథ: భీముని పట్నంలో కేబుల్ టీవీ ఆపరేటర్ కమ్ ఓనర్ గా బతికేస్తుంటాడు శ్రీనివాస్ (హర్షిత్ రెడ్డి). కేబుల్ నుంచి డీటీహెచ్ అందుబాటులోకి వస్తున్న సమయమది. దాంతో డిష్ కుమార్ (వంశీధర్ గౌడ్) పోటీగా వచ్చి శ్రీను వ్యాపారానికి పోటీగా నిలుస్తాడు. ఇక అదే ఊరికి చెందిన స్నేహితుల (గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పెరి)తో కలిసి సరదాగా జీవితాన్ని గడుపుతుంటాడు శ్రీనివాస్. అదే ఊరిలో బ్యాంక్లో పని చేసే శ్రీవల్లి (శ్రియ కొంతం)తో శ్రీనివాస్ పెళ్లి జరుగుతుంది. అతని ఫస్ట్ నైట్ రోజే భార్య శ్రీవల్లి టీవీలో సీరియల్ చూస్తూ వింతగా ప్రవర్తిస్తుంది. అయితే శ్రీను అతని ఇద్దరు స్నేహితులతో పాటు ఊరిలో ఉన్న మగాళ్ళందరి పరిస్థితి అదే. రాత్రి తొమ్మిది కాగానే జన్మజన్మల బంధం టీవీ సీరియల్ చూస్తూ దెయ్యాలు ఆవహించినట్టుగా వింతగా ప్రవర్తిస్తుంటారు ఊరిలోని ఆడవారందరూ. అడ్డుకుంటే, భర్తల పైనా దాడులకు దిగి భయభ్రాంతులను చేస్తుంటారు. సీరియల్ పూర్తయ్యాక అంతా మామూలుగానే ఉంటూ ఏమీ జరగనట్లు ఉంటారు. మగవాళ్లు ఎక్కడ తమ పరువు పోతుందో అని ఎవరికీ చెప్పరు. దీని నుంచి బయట పడగానికి శ్రీను బృందం మాయ మాతాశ్రీ (సమంత)ను ఆశ్రయిస్తారు. మాయ ఏం చెప్పింది? జన్మజన్మల బంధం సీరియల్ కి , ఆత్మలకీ సంబంధం ఏమిటి? ఈ సమస్యకి పరిష్కారం దొరికిందా? అసలు ఇందులో మాయ పాత్ర ఏంటి? చివరికి ఏం జరిగిందన్నది 'శుభం' కథ.

విశ్లేషణ:ఓ చిన్న గ్రామం, ఓ సీరియల్, మూడు జంటలు, ఆ ఊళ్లో మహిళల విచిత్రమైన ప్రవర్తన ఇదీ సింపుల్గా ఈ సినిమా కథ. దీనికి మూలం ఓ సీరియల్. సినిమా మొత్తం సీరియల్ చుట్టూ తిరుగుతుంది. నిర్మాతగా సమంత చెప్పినట్లే ఇదొక హారర్-కామెడీ కథ. అయితే దర్శకుడు అసలు కథలోకి వెళ్లడానికే చాలా సమయం తీసుకున్నాడు. శ్రీను పెళ్లి చూపులు, పస్ట్ నైట్ సీన్ తో కథాలోకి అడుగు పెడతాం. నిజానికి ఇక్కడి నుంచి వేగం పుంజుకోవాలి. అలా జరగలేదు. అందరి ఇళ్లల్లో జరిగే తతంగాన్ని చూపించిందే చూపించి బోర్ కొట్టించాడు. ఆరంభంలో వచ్చే గంగవ్వ, వంశీధర్ గౌడ్ సీన్ ని మినహాయిస్తే ప్రథమార్ధం కాస్త పర్వాలేదనిపిస్తుంది. సీరియల్తో లింక్ అయిన కథను రివీల్ చేసిన తర్వాత వచ్చే సన్నివేశాలు పదే పదే రిపీట్ అయి ఆడియన్స్ తలలు పట్టుకునేలా చేస్తాయి. స్క్రీన్ ప్లే లో బలం లేదు. చిత్రీకరణలో పస లేదు. చివరికి ఆత్మల బాధ తెలిసిన తర్వాత చెప్పేది ఏమీ లేదనే ఫీలింగ్ కలుగుతుంది. సినిమా బండిని ఆసక్తి కరంగా మలిచిన దర్శకుడు తీసిన సినిమాయేనా? ఏమి చూసి సమంత సినిమాను నిర్మించిందనే భావన కలగక పోదు. హారర్ ఎలిమెంట్స్ ని డైలీ సీరియల్ కు లింక్ చేయటం కాస్త కొత్తగా అనిపించినా చిత్రీకరణ పేవలంగా ఉండటంతో తేలిపోయింది.కొత్త నటీనటులు తమ పాత్రల పరిధి మేరకు బాగానే చేశారు. కేబుల్ టీవీ శ్రీనుగా హర్షిత్, అతడి స్నేహితులుగా గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి ఓకె. కథానాయికలుగా చేసిన శ్రియ, శ్రావణి, శాలిని చక్కగా పెర్ఫామ్ చేశారు. డిష్ కుమార్గా వంశీధర్ గౌడ్ మాత్రం బోరు కొట్టించాడు. సమంత అతిథి పాత్ర గురంచి చెప్పటానికి ఏమీ లేదు. సమస్యని సమస్య అని ఎందుకంటారంటే, అది సమస్య కాబట్టి... అనే కొన్ని డైలాగ్స్ ఆకట్టుకుంటాయి. భీముని పట్నం అందాలను సరిగ్గా క్యాప్చర్ చేయలేకపోయారని అనిపించింది. పాటలు, నేపథ్య సంగీతం సోసో... నిజానికి భయపెట్టినా, నవ్వించినా అవి తారా స్థాయిలో ఉంటేనే ప్రేక్షకులు ఓన్ చేసుకుంటారు. అలా లేకపోవడమే ఈ 'శుభం'కు ఓ పెద్ద మైనస్.

విలేకరులు కావలెను.

నేటికేసరి జాతీయ తెలుగు దినపత్రిక గత 15 సం॥ లుగా పాఠకుల ఆదరాభిమానాలు పొందుతూ అంచెలంచెలుగా ఎదిగి దినదినాభివృద్ధి చెందుతూ 16 సం॥లో అడుగు పెట్టి, ప్రతిరోజూ కొన్ని లక్షల మంది వీక్షిస్తున్న నేటికేసరి జాతీయ తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాల్లో అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో రిపోర్టర్‌గా పని చేయుటకు అనుభవజ్ఞులైన విలేకరులు కావలెను.

నేటికేసరి
NETI KESARI TELUGU DAILY తెలుగు దినపత్రిక

జి. వెంకటేశ్వర్లు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంచార్జ్
సెల్: 9849128915

Office Address: H.No. 1-1-562/1, Gandhi Nagar, Hyderabad - 20

NETI KESARI JATHIYA PATRIKA: Printer, Publisher and Owned by VAMSEE KESARI , Published from: H.No. 1-1-508/1/A, Gandhi Nagar, Mushirabad,Hyderabad-20,Telanagana State.
Printed at SRI VARUN PRINTERS & PUBLICATIONS, H.No. 1-1-562/1, Gandhi Nagar ,Hyderabad-20,T.S, Editor: VAMSEE KESARI ,RNI NO: TSTEL/2009/34268 Call: 7093220262. kesarivamsee97@gmail.com